Follow: @ANNTELUGU

07-07-2025

ANN తెలుగు

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 214 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## టెస్ట్‌లో గిల్ రికార్డుల మోత

**కోహ్లీ, గవాస్కర్ రికార్డులు ఉఫ్**


**ప్రశంసలు కురిపించిన కోహ్లీ**

**మహా:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో చారిత్రక విజయం ముంగిట నిలిచిన భారత జట్టు ఆశలపై వరుణుడు నీళ్లు చల్లి ఉత్కంఠ రేపినా, ఈ మ్యాచ్ అనేక రికార్డులకు వేదికైంది. మిగతా 2లో

**టాప్ న్యూస్**

### బిహార్ గూండాల రాజ్యంగా మారింది

- భగ్గుమన్న రాహుల్ గాంధీ



02

### అమెరికాలో పుష్ప

- తెలుగు వారంటే వైల్డ్ ఫైర్
- నాట్స్ వేడుకల్లో అల్లు అర్జున్



02

### రాజకీయాల్లోకి ఎలన్ మస్క్

- ది అమెరికా పార్టీ ప్రకటన
- ప్రజలకు స్వేచ్ఛ కోసం నూతన రాజకీయ వేదిక



02



### నారా లోకేశ్‌తో కేటీఆర్ సీక్రెట్ మీటింగ్

- రెండుసార్లు రహస్య చర్చలు
- సామ రామ్మోహన్ రెడ్డి సంచలన కామెంట్స్

వివరాలు 2లో



### నాకు ఒక్క రోజు హోంమినిస్టర్ పదవి ఇస్తే

- రెడ్ బుక్ కాదు... అంతా బ్లడ్ బుక్కే
- డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో

# మినిస్టర్ దానం?



## రాజీనామాకు రెడీ!

**ఖైరతాబాద్‌లో హాట్ చర్చ**

**జంట బైపోల్స్ ఖాయమా?**

**విస్తరణపై ఊహాగానాలు..**

**ఢిల్లీకి ముఖ్యమంత్రి**

హైదరాబాద్, మహా: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కు ప్రమోషన్ లభించనున్నదా? అనర్హత పంచాయతీ చిక్కులు తొలగించేందుకు, గ్రేటర్ లో కాంగ్రెస్ కు మరింత బూస్ట్ తీసుకొచ్చేందుకు కీలక ప్రతిపాదన చేశారా? దీనికి హైకమాండ్ పెద్దలు కూడా సరేనంటూ భరోసానిచ్చారా? ఖైరతాబాద్ పాలిటిక్స్ లో దీనిపై హాట్ డిస్కషన్ సాగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరడంతో పాటు ఎంపీగానూ పోటీచేశారు. ఇతర ఎమ్మెల్యేల విషయంలో చిక్కులు లేకున్నా.. దానం కారు గుర్తు ఎమ్మెల్యేగా ఉండగానే, హస్తం గుర్తు ఎంపీ అభ్యర్థిగా పోటీచేయడంతో.. ఏమైనా జరగొచ్చనే చర్చ ఉన్నది. ఈ నేపథ్యంలో తనకు మంత్రి పదవి ఇస్తే రాజీనామా చేసి మళ్ళీ గెలుస్తా అంటూ దానం నాగేందర్ పార్టీ పెద్దలకు చెప్పినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అయితే గెలిచిన తర్వాత మంత్రి పదవి గ్యారంటీ అని, సరైన సమయంలో రాజీనామా నిర్ణయం తీసుకోవొచ్చని పార్టీ ముఖ్యులు చెప్పినట్లు తెలిసింది. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఉప ఎన్నికలకు వెళ్తే ఫలితం ఉంటుందని, గ్రేటర్ హైదరాబాద్ లోనూ ఇది పార్టీకి కలిసి వస్తుందని దానం పార్టీ పెద్దలను ఒప్పించే పనిలో ఉన్నట్లు తెలిసింది. తాజాగా ఎఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పర్యటన సందర్భంగా మంత్రివర్గ విస్తరణపై చర్చ జరిగింది. ఖాళీగా ఉన్న పదవులు కూడా భర్తీచేయాలని ఖర్గే సూచించారు. ఖర్గే పర్యటన తర్వాత మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు సాగుతుండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో దీనిపై స్పష్టత వస్తుందని అంచనా వేస్తున్నారు.

### ఖైరతాబాద్‌లో ఇదే చర్చ

మా అన్న మినిస్టర్ కాబోతున్నాడు.. ఖైరతాబాద్ కు బైపోల్ రాబోతోంది అంటూ దానం అనుచరులు ధీమాగా చెబుతున్నారు. దీనిపై పెద్దాయన దగ్గర చర్చ జరిగిందని, తేదీపై స్పష్టత రావాల్సి ఉందంటూ చెబుతున్నారు. ఖైరతాబాద్ కు కూడా జూబ్లిహిల్స్ తో కలిపి ఎన్నిక వచ్చే అవకాశముందని.. రెండు బై పోల్స్ లో విజయం సాధించడం ద్వారా గ్రేటర్ లో పార్టీకి కొత్త ఊపు వస్తుందని విశ్లేషిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి ప్రయోగాలు ఆచరణ సాధ్యమా? క్యాడర్ లో జోష్ కోసం సదరునేత ప్రచారం చేస్తున్నారా? లేక ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ లభించిందా అనే చర్చలు సాగుతున్నాయి. బీఆర్ఎస్ లో కూడా డిసెంబరు కల్లా ఖైరతాబాద్ ఉప ఎన్నిక వస్తుందని చెబుతున్నారు. ఎవరు ప్రచారం చేస్తున్నది నిజమైనా ఖైరతాబాద్ లో బైపోల్ తప్పదు.

# అంగన్ వాడీల్లో కొలువుల పండుగ

**14,236 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

**నియామక నోటిఫికేషన్లకు సాంకేతిక అడ్డంకులు**

**అడ్డంకులు తొలగించేందుకు ఇతర రాష్ట్రాల్లోని నిబంధనలపై అధ్యయనం**

**త్వరలో నోటిఫికేషన్లు**




**హైదరాబాద్, మహా :** తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో భారీ సంఖ్యలో పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది. అంగన్‌వాడీ టీచర్ పోస్టులు 6,399, హెల్పర్ పోస్టులు 7,837 కలిపి 14,236 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఐదుమాసాల క్రితమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా, ఏజెన్సీ ప్రాంతంలో కొన్ని సాంకేతిక సమస్యలున్నాయి. ఆ సమస్యలను తొలగించేదిశగా ఇపుడు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అంగన్ వాడీల అప్‌గ్రేడ్ పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 20 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లు, హెల్పర్లు లేకపోవడంతో కొన్నిచోట్ల రోజువారీ నిర్వహణ, పూర్వ ప్రాథమిక విద్యా బోధన, పోషకాహారం అందించడం కష్టంగా మారుతోంది. పక్కా భవనాలు, సిబ్బంది లేకపోవడంతో ఏజెన్సీలు, ఇతర ప్రాంతాల్లో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ కష్టతరంగా మారుతోంది. 65 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగ విరమణ చేయిస్తున్న ప్రభుత్వం, వాటిని భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య పెరుగుతోంది. మిగతా 2లో

**మొత్తం ఖాళీలు ఇలా**

| | |
|---|---|
| ఖాళీగా ఉన్న సహాయకుల పోస్టులు : | 7,837 |
| ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులు | 1,918 |
| పదవీ విరమణ చేయనున్న సిబ్బంది : | 3,914 |
| టీచర్ పదోన్నతులకు అర్హులైన సహాయకులు | 567 |
| ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టులు: | 1,918 |
| భర్తీ చేయనున్న మొత్తం పోస్టులు : | 14,236 |



### గణేశ మంత్రంతో మోదీకి స్వాగతం


**బ్రెజిల్‌లో ముగ్ధుడైన ప్రధాని**

మహా : బ్రిక్స్ దేశాల 17వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి అపూర్వ, ఆధ్యాత్మిక స్వాగతం లభించింది. రియో డి జనీరో నగరంలో విమానం దిగిన ప్రధానికి, స్థానిక సంగీత కళాకారులు 'ఓం గం గణపతయే నమః' అనే సంస్కృత గణేశ మంత్రాన్ని ఆలపించి ఘనంగా స్వాగతం పలికారు. భారతీయ సంప్రదాయ సంగీతానికి బ్రెజిల్ సంగీత శైలిని జోడించి, అక్కడి గాయనీగాయకులు ఈ మంత్రాన్ని అద్భుతంగా ఆలపించారు. ఈ ప్రదర్శనను చూసి ప్రధాని మోదీ ఎంతో ముగ్ధులయ్యారు. ఆయన చేతులు జోడించి, చిరునవ్వుతో నిలుచుండిపోయారు. ఈ ఆధ్యాత్మిక స్వాగతం భారత సాంస్కృతిక వారసత్వం ప్రపంచవ్యాప్తంగా ఎంతగా విస్తరిస్తోందో తెలియజేసింది. కార్యక్రమం ముగిశాక ప్రధాని మోదీ స్వయంగా ఆ కళాకారులను కలిసి అభినందించారు.

## హైదరాబాద్ నుండి ఏపీకి తరలించండి

**జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డుపై కేంద్రానికి చంద్రబాబు లేఖ**



**అమరావతి, మహా :** తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్న జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌కు చంద్రబాబు లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారని చంద్రబాబు గుర్తు చేశారు. 2006లో హైదరాబాద్‌లో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి.. మత్స్య అభివృద్ధి కార్యకాలాపాలకు అవకాశం ఇచ్చారని చంద్రబాబు లేఖలో వివరించారు. మిగతా 2లో

### అధికారాలు బదలాయిస్తున్న జిన్‌పింగ్

- పదవీ విరమణకు చైనా అధ్యక్షుడి సన్నాహాలు



02

07



### హిమాచల్‌లో 75 మరణాలు


**వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధింపు**

## సంఘాలకు అండగా.. నిధులు దండిగా

**పది కుల సంఘాలకు కమ్యూనిటీహాల్‌లకు నిధులు**

- ఒక్కో సంఘానికి రూ.5లక్షల చొప్పున రూ.50లక్షలు మంజూరు
- నాయకులకు ప్రొసిడింగ్ కాపీలు అందించిన కంది శ్రీనివాస రెడ్డి
- ప్రభుత్వం, శ్రీనివాస రెడ్డిని కృషిని కొనియాడిన నాయకులు
- సందడిగా మారిన ప్రజా సేవా భవన్

02



# అంగన్ వాడీల్లో కొలువుల పండుగ

## 14,236 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

దీంతో ప్రభుత్వం ఈ పరిస్థితిని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. మొత్తం 14,236 పోస్టులకు శిశు సంక్షేమ శాఖ ఆమోదం తెలిపింది. కానీ నోటిఫికేషన్ల జారీకి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రెండు రోజుల క్రితం దీనిపై సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. త్వరగా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. మొత్తం ఖాళీల్లో 6,399 టీచర్, 7,837 హెల్పర్ పోస్టులు ఉన్నాయి.




**తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు**

తెలంగాణలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రంలో టీచర్‌తో పాటు హెల్పర్ తప్పనిసరిగా ఉండాలి. గతంలో ఈ పోస్టులకు ఎంపికైన వారిలో పలువురు రిజైన్ చేయడం, ఇప్పటికే పని చేస్తున్న వారికి సూపర్‌వైజర్లుగా పదోన్నతులు రావడంతో సిబ్బంది కొరత ఏర్పడింది. 65 ఏళ్లు నిండిన టీచర్లు, సహాయకులు ఉద్యోగ విరమణ చేశారు. వారి సంఖ్య దాదాపు 7 వేలుగా ఉంది. ఖాళీలు ఎక్కువగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్నాయి. అక్కడి కేంద్రాల్లో స్థానిక ఆదివాసీలు, గిరిజనుల్ని నియమించి, వారితోనే పూర్వ ప్రాథమిక విద్యను మాతృభాషలో అందించాలని సర్కార్ భావిస్తోంది. ఈ మేరకు నియామకాలు చేపట్టేందుకు సాంకేతిక అడ్డంకులు ఎదురవుతున్నాయి.

**ఏజెన్సీలో ఇబ్బందులు**

గతంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు ఉండేవి. ఈ రిజర్వేషన్ల జీవోను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ నేపథ్యంలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఎలా ముందుకు వెళ్లాలని సంబంధిత శాఖ సమాలోచనలు చేస్తోంది. సాధారణ ఉద్యోగ ప్రకటన కింద నోటిఫికేషన్ ఇస్తే మాతృభాషలో విద్యాబోధన కష్టమవుతుందని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో నోటిఫికేషన్లో సంబంధిత భాషలు తెలిసి ఉండాలన్న నిబంధన చేర్చితే ఎలా ఉంటుంది అన్న విషయాన్ని పరిశీలిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నియామకాలు ఏవిధంగా చేపడుతున్నారో అధ్యయనం చేసి వీలైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని శిశు సంక్షేమశాఖ అధికారులను ఆ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. అధ్యయన నివేదిక అనంతరం ఉద్యోగ ప్రకటనలపై ముందుకు వెళ్లనుంది.

**ఇంటర్మీడియట్ అర్హత తప్పనిసరి**

గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు పొందాలంటే కనీసం పదో తరగతి పాసై ఉండాలి. కానీ ప్రస్తుతం కేంద్రం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం టీచర్‌తో పాటు హెల్పర్లకు కనీసం ఇంటర్ పాసైన అనుభవం ఉండాలి. దీంతో ఇంటర్మీడియట్ అర్హతను తప్పనిసరి చేయనున్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా కేంద్రం పేర్కొంది.

**టీచర్లుగా పదోన్నతి?**

కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీలో 50 శాతం సహాయకులకు కేటాయించాలి. అయితే ప్రస్తుతం పనిచేస్తున్న సహాయకుల్లో టీచర్లుగా పదోన్నతి పొందేందుకు చాలా మందికి విద్యార్హతలు లేవు. ఇంటర్మీడియట్ పాసైన హెల్పర్లు 567 మంది మాత్రమే ఉన్నట్లు శిశు సంక్షేమశాఖ గుర్తించింది. వారందరికీ పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి.

# రాజకీయాల్లోకి ఎలన్ మస్క్

## ది అమెరికా పార్టీ ప్రకటన.. ప్రజలకు స్వేచ్ఛ కోసం నూతన రాజకీయ వేదిక

**మహా :** టెక్ దిగ్గజం, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేశారు. అమెరికా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రంగప్రవేశం చేశారు. తాను అమెరికా పార్టీ అనే కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేశానని ఎక్స్ వేదికగా వెల్లడించారు. దేశం ప్రస్తుతం ఒకే పార్టీ పాలనలో ఉందని విమర్శించిన మస్క్, ప్రజలకు తిరిగి స్వేచ్ఛను అందించాలన్న సంకల్పంతో ఈ నూతన రాజకీయ వేదికను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ పార్టీ ఎక్కడ రిజిస్టర్ అయ్యింది అనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వద్ద ఇప్పటివరకు దీని పేరు నమోదు కాలేదని తెలుస్తోంది.

**వ్యూహాత్మకంగా మస్క్ ఎత్తుగడలు**

అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జులై 4వ తేదీ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రెండు పార్టీల ఆధిపత్యం నుంచి విముక్తి కావాలా? అని మస్క్ ఎక్స్ ద్వారా పోలింగ్ నిర్వహించగా 12 లక్షలకుపైగా మంది స్పందించారు. ఇందులో మెజార్టీ మంది అవును అని స్పందించడంతో అమెరికా పార్టీని మస్క్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ మీరు 2:1 నిష్పత్తిలో కొత్త పార్టీని కోరారు. ఈ పార్టీ మీకే అంకితం! ఇది అధిక ఖర్చులు, అవినీతితో దేశాన్ని అప్పుల్లో నెట్టేసే ఒకే పార్టీ పాలన. ఇది ప్రజాస్వామ్యం కాదు' అని మస్క్ మండిపడ్డారు. మస్క్ పార్టీ ప్రధానంగా అమెరికా కాంగ్రెస్‌లోని 2 లేదా 3 సెనెట్ సీట్లు, 8 నుంచి 10 నియోజకవర్గాలపై



దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. చట్టాలు ఆమోదించడంలో కీలకంగా మారడానికి అమెరికా కాంగ్రెస్‌లో ఈ నంబర్ సరిపోతుంది. అందుకే మస్క్ మొదట అధికారం కోసం కాకుండా వ్యూహాత్మకంగా సెలక్టివ్‌గా ముందుకు పోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల ప్రజల నిజమైన అభిమతాన్ని ప్రతిబింబించే విధానాలు అమలులోకి వస్తాయని మస్క్ భావిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నిలవని ట్రంప్ - మస్క్ స్నేహం**

2024 అధ్యక్ష ఎన్నికల సమయంలో డొనాల్డ్ ట్రంప్‌కు టెస్లా అధినేత మస్క్ గట్టి మద్దతు ఇచ్చారు. ట్రంప్ గెలుపులో అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందించారు. ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి భారీ విరాళాలను అందించారు. 280 మిలియన్ డాలర్లకు పైగా విరాళాలు అందించగా, వాటిలో మెజారిటీ డొనాల్డ్ ట్రంప్‌కు, మిగతా భాగం ఇతర రిపబ్లికన్ అభ్యర్థులకు ఇచ్చారు. దీంతో ట్రంప్ కు మస్క్ మరింత దగ్గరయ్యారు. ఇద్దరు మంచి స్నేహితులయ్యారు. ఈ క్రమంలో ఎంతో కీలకమైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషెన్సీ (డీఓజీఈ) నాయకత్వ బాధ్యతలను మస్క్‌కు ట్రంప్ అప్పగించారు. అయితే ఈ స్నేహం ఎక్కువకాలం నిలవలేదు. మూణ్నాళ్ల ముచ్చటగానే నిలిచిపోయింది. ఇటీవల మస్క్‌ట్రంప్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో డీఓజీఈ బాధ్యతల నుంచి మస్క్ తప్పుకున్నారు. ఆ తర్వాత ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన బిగ్, బ్యూటిఫుల్ బిల్లుపై కూడా మస్క్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ బిల్లు ద్వారా అమెరికా రుణం రికార్డు స్థాయిలో ఐదు ట్రిలియన్ డాలర్ల వరకు పెరుగుతుందని తప్పుబట్టారు. ఇదే సందర్భంలో ట్రంప్ కూడా మస్క్‌కు కౌంటర్ ఇచ్చారు. మస్క్‌ను అమెరికా నుంచి పంపించివేయాల్సి వస్తుందని, ఆయన తన కంపెనీలను మూసుకొని దక్షిణాఫ్రికాకు వెళ్లాల్సి వస్తుందన్న స్థాయిలో హెచ్చరించారు. మస్క్ దక్షిణాఫ్రికాలో జన్మించారు. 2002లో అమెరికా పౌరసత్వం పొందారు.



# బిహార్ గూండాల రాజ్యంగా మారింది

## భగ్గుమన్న రాహుల్ గాంధీ

**మహా:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిహార్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. నితీష్ కుమార్ ప్రభుత్వం రాష్ట్రాన్ని గుండాల రాజ్యంగా మార్చిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖేమ్కా హత్యపై మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు బిహార్ దోపిడి, కాల్పులు, హత్యల నీడలో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. నేరాలు అనేవి సాధారణం అయిపోయాయని విమర్శించారు. వీటిని నిర్మూలించడంలో నితీష్ కుమార్ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పౌరులను రక్షించని పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు. ఇలాంటి దారుణాలు, దోపిడీలను పూర్తిగా నిర్మూలించే సమయం వచ్చిందని తెలిపారు.

**సంచలనంగా హత్యలు**

పట్నాలోని గాంధీ మైదాన్ ఠాణా పరిధిలో శుక్రవారం గోపాల్ ఖేమ్కా హత్యకు గురయ్యారు. రాత్రి 11.40 గంటలకు తన ఇంటికి చేరుకున్న ఆయన కారు దిగుతుండగా అక్కడికి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. దీంతో ఈ ఘటన బిహార్ రాజకీయాల్లో సంచలనం రేపింది. దీనిపై ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్ కూడా ధ్వజమెత్తారు. గోపాల్ ఖేమ్కాను దుండగులు పట్నా నడిబొడ్డున హత్య చేస్తే.. అక్కడి పోలీసులు చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టిందని తెలిపారు. ఆరేళ్ల క్రితం కూడా ఆ వ్యాపారవేత్త కుమారుడిని ఇలానే హత్య చేశారని.. కానీ హంతకులను అరెస్టు చేయలేదని ధ్వజమెత్తారు.

# నాకు ఒక్క రోజు హోంమినిస్టర్ పదవి ఇస్తే..

## రెడ్ బుక్ కాదు... అంతా బ్లడ్ బుక్కే

### డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు సంచలన వ్యాఖ్యలు

**మహా:** అమెరికాలో నిర్వహించిన తానా 24వ ద్వైవార్షిక మహాసభల్లో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తనదైన శైలిలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మీరు హోంమంత్రి అయితే రెడ్ బుక్ అమలు చేస్తారా అని యాంకర్ అడగ్గా... తన వద్ద రెడ్ బుక్ ఉండదని, అది వేరే వాళ్ల వద్ద ఉందని రఘురామ బదులిచ్చారు. అయితే, తనదగ్గర బ్లడ్ బుక్ ఉందని స్పష్టం చేశారు. గతంలో తనపై జరిగిన అరాచకాల తాలూకు రక్తపు చారలు తనకు ఇంకా గుర్తున్నాయని రఘురామ అన్నారు. ఆ విధంగా తాను బ్లడ్ బుక్ తో ముందుకెళతానని తెలిపారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.




# నారా లోకేశ్‌తో కేటీఆర్ సీక్రెట్ మీటింగ్

- రెండుసార్లు రహస్య చర్చలు
- సామ రామ్మోహన్ రెడ్డి సంచలన కామెంట్స్

**హైదరాబాద్, మహా:** ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రహస్య మంతనాలు జరుపుతున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేటీఆర్.. ఇటీవల పక్క రాష్ట్రంలో అధికారంలో ఉన్న నేతలను కలిశారని కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి, కృష్ణాలో తెలంగాణ వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాటం చేస్తుంటే.. బనకచర్ల ప్రాజెక్టు ఆపేందుకు ప్రయత్నాలు చేస్తుంటే.. కేటీఆర్ మాత్రం ఏపీ మంత్రి నారా లోకేశ్ తో సీక్రెట్ మీటింగ్స్ జరిపారని ఆరోపించారు. కేటీఆర్‌తో నారా లోకేశ్ మంతనాలు ఒక్కసారి కాదు.. రెండు సార్లు కలిశారు.. అని అన్నారు. ఆ రహస్య మంతనాలు ఎవరికి లబ్ది చేయడానికో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై కేటీఆర్ స్పందించి లోకేశ్‌ను కలవలేదంటే అప్పుడు స్పందిస్తా.. తప్పు అని అంటే వివరాలు అన్నీ బయటపెడతా.. అని హాట్ కామెంట్స్ చేశారు. తెరవెనక తెలంగాణకు కుట్రలు చేస్తుంది ఎవరు? లోకేశ్ కేటీఆర్ భేటీతో అర్థం అవుతుందన్నారు.

# సంఘాలకు అండగా.. నిధులు దండిగా

- పది కుల సంఘాలకు కమ్యూనిటీహాల్ లకు నిధులు
- ఒక్కో సంఘానికి రూ.5లక్షల చొప్పున రూ.50లక్షలు మంజూరు
- నాయకులకు ప్రొసీడింగ్ కాపీలు అందించిన కంది శ్రీనివాస రెడ్డి
- ప్రభుత్వం, శ్రీనివాస రెడ్డిని కృషిని కొనియాడిన నాయకులు
- సందడిగా మారిన ప్రజా సేవా భవన్



**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం కుల సంఘాలకు అండగా నిలిచింది. ఆయా సంఘాల కమ్యూనిటీహాల్ ల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన కోసం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్ డీఎఫ్) రూ.10కోట్లు కేటాయించగా.. ఇందులో నుంచి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం మంజూరు చేసింది. కంది శ్రీనివాస రెడ్డి నియోజకవర్గంలోని పది కులాల సంఘాలకు గాను ఒక్కోదానికి రూ.5లక్షల చొప్పున రూ.50లక్షల నిధులు కేటాయించారు. మున్నూరు కాపు, రెడ్డి, రజక, ముదిరాజ్, నాయి బ్రాహ్మణ, గంగపుత్ర, మాదిగ, మాల, గోండ్, లంబాడ కుల సంఘాల భవనాల్లో వివిధ రకాల మౌళిక వసతులు కల్పించేందుకు కేటాయించారు. తాజాగా ఆయా సంఘాల నాయకులకు కంది శ్రీనివాస రెడ్డి ప్రజా సేవా భవన్ లో ఆదివారం ప్రొసిడింగ్ కాపీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. పేదలు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తోందని గుర్తు చేశారు. ఈ నిధులు మంజూరు కావడంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రస్తుత జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. వారి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని భరోసా ఇచ్చారు.


**ప్రభుత్వ కృషి గొప్పది**

కమ్యూనిటీ హాళ్లలో చేపట్టనున్న వివిధ అభివద్ధి పనుల నిమిత్తం కంది శ్రీనివాస రెడ్డి నుంచి ప్రొసిడింగ్ కాపీలు అందుకున్న ఆయా కుల సంఘాల నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల సంఘాల అభ్యున్నతి కోసం నిధులు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన కంది శ్రీనివాస రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావడంలో ప్రజా సేవా భవన్ సందడిగా మారింది.

# అధికారాలు బదలాయిస్తున్న జిన్‌పింగ్

## పదవీ విరమణకు చైనా అధ్యక్షుడి సన్నాహాలు

**మహా:** చైనాలో అధికార మార్పిడి ప్రచారానికి మరింత ఊతమిచ్చేలా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చర్యలు తీసుకుంటున్నారు. 12 ఏళ్లలో తొలిసారి తన అధికారాల్లో కొన్నిటిని చైనా కమ్యూనిస్టు పార్టీ విభాగాలకు అప్పగించేందుకు కసరత్తు మొదలు పెట్టారు. పార్టీ విభాగాల పనితీరు మెరుగుపరిచేందుకు చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిటికల్ బ్యూరో నూతన నిబంధనలపై దృష్టి పెట్టింది. వయోభారం కారణంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తప్పుకుంటారన్న ప్రచారానికి మరింత బలం చేకూరుతోంది. చైనాలో అత్యంత శక్తివంతమైన అధికార కమ్యూనిస్టు పార్టీ కీలక శాఖలకు ఆయన అధికారం అప్పగించడం ప్రారంభించారు.



**పదవీ విరమణకు జిన్‌పింగ్ సన్నాహాలు**

జిన్‌పింగ్ తన 12 ఏళ్ల పాలనలో అధికార పార్టీ విభాగాలకు అధికారాలు బదలాయింపు చేపట్టడం ఇదే తొలిసారి. అధికార బదిలీకి లేదంటే పదవీ విరమణకు జిన్‌పింగ్ సన్నాహాలు చేయడంలో ఇదో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనాకు చెందిన 24 మంది సభ్యుల పొలిటకల్ బ్యూరో జూన్ 30న సమావేశమై పార్టీ రాజ్యాంగం పనితీరుపై నూతన నిబంధనలపై సమీక్షించినట్లు అధికార జిన్హువా వార్తా సంస్థ తెలిపింది. ఆ సమావేశానికి స్వయంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వం వహించారు. నూతన నిబంధనలు సీపీసీ సెంట్రల్ కమిటీ తీసుకునే నిర్ణయాలు, ఆలోచనాత్మకంగా, అన్ని సంస్థలతో సమన్వయంగా ఉండాలని ఈ సందర్భంగా జిన్‌పింగ్ నొక్కి చెప్పారని సమాచారం. తద్వారా ఆయా సంస్థలు మరింత ప్రభావవంతమైన నాయకత్వం, కీలకమైన అంశాల్లో సమన్వయం, ప్రణాళికలపై బాగా దృష్టి పెట్టేలా ఉండాలని ఆదేశించారని జిన్హువా వార్తా సంస్థ వివరించింది. పొలిటికల్ బ్యూరో సమావేశం అధికార బదలాయింపునకు సంకేతమని భావిస్తున్నారు.


**అంతర్గత వివాదాలు**

అధికార కమ్యూనిస్టు పార్టీలో అధికారంపై అంతర్గతంగా ఇటీవల కాలంలో వివాదం నడుస్తోందని విదేశాల్లో ఉంటున్న ప్రభుత్వ వ్యతిరేక చైనా జాతీయులు చెబుతున్నారు. పొలిటికల్ బ్యూరో సమావేశం జిన్‌పింగ్ పదవీ విరమణకు జరుగుతున్న సన్నాహమేనని చైనా రాజకీయ విశ్లేషకుడు చెప్పారు. అధికార బదిలీకి కీలక సమయం కాబట్టే కమ్యూనిస్టు పార్టీలో కీలక విభాగాలకు నిబంధనలు ఖరారు చేస్తున్నట్లు హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక ఒక నిపుణుడి మాటలను ఉద్దేశిస్తూ కథనం ప్రచురించింది.

## ఎంతో పట్టు సాధించిన జిన్ పింగ్

**2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా జిన్‌పింగ్ ఎంపికైంది మొదలు చైనాలో అధికార కేంద్రాలైన పార్టీ, అధ్యక్ష కార్యాలయం, సెంట్రల్ మిలటరీ కమిషన్‌పై ఆయన ఎంతో పట్టు సాధించారు. అదే బలంతో అవినీతి వ్యతిరేక చర్యలతో లక్షలాది మంది ఉద్యోగులను శిక్షించారు. అనేక మంది సైనిక ఉన్నతాధికారులను తొలిగించారు. అదే పట్టుతో రాజ్యాంగ చట్టాలను మార్చి మూడో పర్యాయం సీపీసీ ప్రధాన కార్యదర్శిగా, దేశ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అంతకుముందు ఉన్న అధ్యక్షులు అందరూ ఐదేళ్ల చొప్పున రెండుసార్లు పనిచేసి పదవీ విరమణ చేయగా, మావో జెడాంగ్ అంతటి నేతగా చెప్పకుంటూ జిన్‌పింగ్ మూడోసారి అధ్యక్ష పదవిని చేపట్టారు. మూడో పర్యాయం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయన పదవీకాలం 2027తో ముగుస్తుంది. ఈ లోపే జిన్‌పింగ్ పదవీ విరమణ చేయడమో, లేక అధికారాన్ని బదలాయించడమో తేలిపోతుందని నిపుణులు భావిస్తున్నారు.**

# హైదరాబాద్ నుండి ఏపీకి తరలించండి



(మొదటిపేజీ తరువాయి)

అయితే ఇప్పుడు ఈ బోర్డును ఏపీ రాజధాని అమరావతికి తరలించాలని చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఉన్న జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును అమరావతికి తరలించాలన్న చంద్రబాబు.. అందుకు గల కారణాలను లేఖలో వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పటికీ.. ఆక్వా, మత్స్య ఉత్పత్తులలో ఏపీదే కీలకమైన వాటా అని చంద్రబాబు వివరించారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డును అమరావతికి తరలించాలని చంద్రబాబు కోరారు. దేశ ఆక్వారంగానికి ఆంధ్రప్రదేశ్ నాయకత్వం వహిస్తోందని.. ఏపీలో సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఏపీలో రొయ్యల పరిశ్రమ కూడా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని చంద్రబాబు లేఖలో వివరించారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఏపీలో ఏర్పాటు చేయడానికి అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు.

# టెస్ట్‌లో గిల్ రికార్డుల మోత

(మొదటిపేజీ తరువాయి)

ఈ మ్యాచ్‌లో కెప్టెన్ గిల్ తొలి ఇన్నింగ్స్ డబుల్ సెంచరీతో అదరగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో శతకం సాధించాడు. ఈ క్రమంలో మాజీలు సునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీ రికార్డులు బ్రేక్ చేశాడు. సునీల్ గవాస్కర్ (వెస్టిండీస్‌పై 1971) తర్వాత ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన రెండో భారత బ్యాటర్‌గా రికార్డ్ సృష్టించాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన తొమ్మిదో బ్యాటర్‌గా ఘనత వహించాడు. దీంతో పాటు సునీల్ గవస్కర్ (344)ను అధిగమించి ఒకే మ్యాచ్‌లో అత్యధిక రన్స్ చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఆ తర్వాత 2001లో వీవీఎస్ లక్ష్మణ్ ఆస్ట్రేలియాపై 340 పరుగులతో, సౌరభ్ గంగూలీ 2007లో పాకిస్థాన్‌పై 330పరుగులు, వీరేంద్ర సెహ్వాగ్ 2008లో సౌతాఫ్రికాపై 319 పరుగులు చేశారు. ఇండియా కెప్టెన్‌గా తొలి సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన వ్యక్తిగా కోహ్లీ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. కాగా ఇప్పటివరకు 449 పరుగులతో కోహ్లీ పేరిట ఈ రికార్డు ఉంది. 201415లో ఆస్ట్రేలియాతో సిరీస్‌లో కెప్టెన్‌గా ఈ రికార్డు సాధించాడు. ఇపుడు ఈ రికార్డూ బద్దలు కొట్టేశాడు. భారత టెస్ట్ జట్టు నూతన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తన రికార్డులను తానే బద్దలు కొడుతున్న ఈ యువ కెరటంపై మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో గిల్ (161) అద్వితీయమైన శతకంతో కదం తొక్కాడు. ఈ అద్భుత ప్రదర్శనపై కోహ్లీ స్పందిస్తూ గిల్‌ను 'స్టార్ బాయ్' అని అభివర్ణించాడు. గిల్ అద్భుత బ్యాటింగ్‌పై విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో స్పందించాడు. "అద్భుతంగా ఆడావు స్టార్ బాయ్. చరిత్రను తిరగరాస్తున్నావు. ఇకపై నీకు అంతా మంచే జరగాలి. నువ్వు దీనికి పూర్తిగా అర్హుడివి" అని పోస్ట్ చేశాడు. కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయినప్పటికీ, తన వారసుడి ప్రదర్శనను అభినందించడం క్రీడా వర్గాల్లో ఆసక్తిని రేపింది.



# అమెరికాలో పుష్ప

## తెలుగు వారంటే వైల్డ్ ఫైర్

### నాట్స్ వేడుకల్లో అల్లు అర్జున్

**మహా:** అమెరికాలో జరిగిన 'నాట్స్ 2025' వేడుకల్లో టాలీవుడ్ తారలు సందడి చేశారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తనదైన 'పుష్ప' స్టైల్ డైలాగులతో అక్కడి తెలుగు వారిలో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, నటి శ్రీలీల పాల్గొని ప్రవాసాంధ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ.. "తెలుగు వారంటే ఫైర్ అనుకున్నారా.. వైల్డ్ ఫైర్" అంటూ తనదైన శైలిలో డైలాగ్ చెప్పి అభిమానులను ఉర్రూతలూగించారు. "నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా.. ఇంటర్నేషనల్" అని చమత్కరించారు. ఇంతమంది తెలుగు వారిని ఒకేచోట చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్నట్లే ఉందని సంతోషం వ్యక్తం చేశారు. విదేశాల్లోనూ తెలుగు సంస్కృతిని కాపాడుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. "భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే.. అందులోనూ తెలుగోళ్లు అస్సలు తగ్గేదేలే" అని అనడంతో సభ ప్రాంగణం చప్పట్లతో మారుమోగింది.


# దేశభక్తిని అడ్డం పెట్టుకుని పార్టీని భ్రష్టుపట్టిస్తారా?

## బీజేపీలో కొనసాగే అర్హత మీకు లేదు.. వికారాబాద్ బీజేపీ నేతలపై ఎంపీ కొండా ఫైర్



**వికారాబాద్, మహా :** తమ వ్యక్తిగత స్వార్థం తో కొందరు బిజెపి పార్టీని బలహీనం చేస్తున్నారని బిజెపి నాయకులు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం చేసిన ఆయన మాట్లాడుతూ... కొందరు దేశభక్తిని అడ్డం పెట్టుకొని జిల్లాలో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీకు దేశభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్ లో చేరి దేశానికి సేవ చేయాలని, అంతే కానీ బీజేపీ లాంటి రాజకీయ పార్టీలో కొనసాగే అర్హత మీకు లేదని అన్నారు. అలాంటి వ్యక్తిత్వం, స్వార్థం ఉన్నవారు బిజెపి పార్టీలో ఉండరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు... స్థానిక బీఆర్ఎస్ పార్టీ, జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల లాగా గ్రౌండ్ లెవెల్ లో పనిచేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మంచితనం అంటారు, మాంసం తినేవారికి పార్టీలో స్థానం లేదు అంటారు. ఇలా అయితే పార్టీ బలోపేతం అవుతుందా..? దేశంలో మోదీ, జిల్లాలో నేను ఎలాగైనా గెలుస్తాం. దానివల్ల మీకు ఉపయోగం ఏంటి..? పార్టీలో జిల్లా అధ్యక్ష పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టుల కోసం కొట్లాడడం కాదు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాకు జిల్లా నుండి 5000 వార్డు మెంబర్లు, 540 మంది సర్పంచ్ లు గెలిచి చూపించాలి. అందుకోసం పార్టీ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించడానికి నేను సిద్ధంగా ఉన్నాను, సర్పంచ్ లు, వార్డు మెంబర్లు గా గెలవడానికి మీరు సిద్ధంగా ఉన్నారా..? అని నాయకులు, కార్యకర్తలను ఎంపీ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి, నాయకులు వడ్ల నందు, నవీన్ తదితర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ



**ఆదిలాబాద్, మహా:** ఆశాడ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ప్రసిద్ధ ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ముఖ్యంగా పట్టణంలోని విఠల రుకుంబాయి ఆలయాలు భక్తులతో కిట కిట లాడాయి. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం నుండే భక్తుల సందడి నెలకొంది. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ఉపవాస దీక్షలను పాటించారు. హిందూ పండగలలో వచ్చే తొలి పండగగా భావించి ప్రత్యేక పూజలు జరపడంతో ఆలయాల్లో సందడి వాతావరణం నెలకొంది. పండగను పురస్కరించుకుని స్థానిక మార్వాడి ధర్మశాల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుండే భక్తుల తాకిడి కనిపించింది. స్వామివారిని ప్రత్యేక హారతులతో కొలిచిన భక్తులు... వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి ఆరాధించారు. అదేవిధంగా స్థానిక రాం నగర్ లో గల శ్రీ విఠల రుక్మాబాయి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి వచ్చి వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. వేకువజాము నుండే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించగా.. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం కమిటి ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మరోవైపు తొలి ఏకాదశిని పురస్కరించుకుని తాంసి మండలం కప్పర్ల గ్రామానికి చెందిన భక్తులు కుచులాపూర్ లోని విఠలేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరారు. స్థానిక రామ మందిరం నుండి ప్రారంభమైన పాదయాత్రలో భజన, సంకీర్తనలు చేస్తూ ముందుకు సాగారు. పదహారు కిలోమీటర్లు పాదయాత్ర జరగనుండగా... ఇందులో ఆలయ అర్చకులు విశాల్ శర్మ, కప్పర్ల గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్, పడాల శేఖర్ లతో పాటు మహిళ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు విశాల్ శర్మ ఏకాదశి విశిష్టత ను తెలియజేసారు. లోక కళ్యాణం కాంక్షిస్తూ పాదయాత్ర చేపట్టినట్లు వివరించారు.




## జంతువుల నుంచి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


**ఆదిలాబాద్, మహా:** పెంపుడు జంతువుల నుండి వ్యాధులు సంక్రమించకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముందని పశు సంవర్ధక శాఖా సహాయ సంచాలకులు డాక్టర్ గోపికృష్ణ సూచించారు. ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా పట్టణంలోని పశు వైద్య శాలలో ఆదివారం శునకాలకు రేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ.... ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొదటిసారిగా యాంటి రేబిస్ టీకాను కనుగొన్న రోజునే జునోసిస్ డే గా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా శునకాలకు యాంటి రేబిస్ టీకాలను పశు సంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. పెంపుడు జంతువుల మల మూత్రంతో పాటు వారి సలైవాకు దూరంగా ఉంటే వ్యాధులు వచ్చే ఆస్కారం ఉండదని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు దూద్ రామ్ రాథోడ్, గజానన్, రజనీకాంత్, పద్మ, ఖాజాపాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉంది

### కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి
### లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




**ఆదిలాబాద్, మహా:** పేద,బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను ఆదివారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భావన్ లో లబ్ధిదారులకు అందించారు. రూ. 3.26లక్షల విలువ గల ఎనిమిది మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బొక్కలగూడ కు చెందిన అర్షియా అంజుమ్ కు రూ. 60వేలు, లాండసాంగ్వికి చెందిన బుద్దె వందన కు రూ. 28వేలు, యాపల గూడకు చెందిన సౌజన్య కు రూ. 26,500, కౌట గ్రామానికి చెందిన సురేఖ కు రూ. 60వేలు, వాఘాపూర్ కు చెందిన జ్యోతి కి రూ. 24వేలు, మసూద్ నగర్ కు చెందిన నఫీస్ ఫాతిమా కు రూ.60వేలు, తాటిగూడకు చెందిన సునైద్ కు రూ.42, 500 ,వాఘాపూర్ కు చెందిన యాదమ్మ కు రూ.25వేలు విలువ గల చెక్కులను అందించారు. అనంతరం అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. సీఎం ఆర్ ఎఫ్ నిధుల సహాయం కోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. తను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చెక్కులు విడుదలయ్యేలా కృషి చేస్తానన్నారు. అటు చెక్కులు తీసుకున్న వారు ప్రభుత్వానికి, కంది శ్రీనివాస రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు



## కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరికలు

**ఆదిలాబాద్, మహా :** కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో చేరికల సందడి నెలకొంది. నియోజకవర్గంలోని ఆయన అభిమానులు కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీగా తరలివచ్చారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు కంది శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ పై ఉన్న అభిమానంతో ఆదివారం పార్టీలో చేరారు.వారికి కంది శ్రీనివాస రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

### చెన్నూరు అభివృద్ధిని జీర్ణించుకోకనే
# అసత్యపు ఆరోపణలు
## తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ స్పష్టత



**మంచిర్యాల, మహా :** చెన్నూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోకనే ప్రతిపక్షాలు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని చెన్నూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద వాక్యానించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే నా ఉద్దేశమని వెల్లడించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని అంతర్గత రోడ్లు మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని వివరించారు. ప్రతిపక్ష పార్టీలు గత కొన్ని నెలలుగా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుతో పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కొత్త బస్టాండ్ ఆవరణలో ఐదు కొత్త ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## మొహరం వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల కేంద్రంలో జరిగిన మొహరం వేడుకల్లో ఆదివారం అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి గారు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి సవార్లను తిలకించారు... భక్తిశ్రద్ధలతో పీరీలకు దట్టీలు సమర్పించారు.

# తెలంగాణలో 1,07,218 ఇంజినీరింగ్ సీట్లు
## ఉన్నత విద్యామండలి ప్రకటన

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభం నేపథ్యంలో ఉన్నత విద్యా మండలి కీలక ప్రకటన చేసింది. రాష్ట్రంలో ఎన్ని ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి? వాటిలో భర్తీ చేసే సీట్ల వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో మొత్తంగా 171 ఇంజినీరింగ్ కళాశాలల్లో 1,07,218 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపింది. వీటిలో కన్వీనర్ కోటా (70శాతం) కింద 76,795 సీట్లు భర్తీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తూ ప్రత్యేక జాబితాను విడుదల చేసింది. మరోవైపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు జులై 8వ తేదీ ఆఖరి గడువు అని తెలిపింది. అడ్మిషన్ల కోసం 95,654మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని.. 76,494మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరయ్యారని తెలంగాణ సాంకేతిక విద్య కమిషనర్, టీజీ ఈఏపీసెట్ కన్వీనర్ ఎ. శ్రీదేవసేన ఓ ప్రకటనలో తెలిపారు.



## నూతన పీహెచ్ సీని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా ప్రారంభించబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆదివారం సందర్శించారు.ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను స్థానిక నాయకులు, ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట నాయకులు గిమ్మ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, మాజీ మార్కెట్ చైర్మన్ వామన్ వాంఖడే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంజయ్ గుండావార్, పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, సుధాం రెడ్డి, రాజా రెడ్డి, పురుషోత్తం రెడ్డి, నైతాం సీతారాం, కన్య రాజు, ప్రభాకర్ తదితరులున్నారు.

# దేశ భవిష్యత్తును తీర్చిదిద్దిన గనులు మహనీయులు

## ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

- బాబు జగ్జీవన్ రామ్ కు ఘనంగా నివాళులు
- వాళ్లు చేసిన సేవలను గుర్తు యువత తెలుసుకోవాలి
- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి, బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, విగ్రహానికి పూలమాలవేసి చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, కేఎస్ రత్నం ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ లో ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం పాల్గొని మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం మంత్రివర్గంలో ఉండి జమ్ము కాశ్మీర్ పై ప్రత్యేకంగా 370 ఆర్టికల్ ఇయ్యొద్దు, అది భారతదేశంలో ఒక భాగమని ఆనాడు పోరాటం చేసిన శ్యాం ప్రసాద్ ముఖర్జీని, జైల్లో పెట్టి సచ్చే వరకు చిత్రహింసలు పెట్టారని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 370 ఆర్టికల్ ను రద్దు చేసి, కాశ్మీర్ ప్రాంతాన్ని భారత దేశంలో ఒక భాగంగా విలీనం చేయడం జరిగిందని తెలిపారు. ఆనాడు 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాటం చేసిన శముఖర్జీ సేవలను గుర్తు చేసుకుంటూ, చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆవరణంలో మొక్కలు నాటడం జరిగిందని అన్నారు. దేశంలోని బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన, బాబు జగ్జీవన్ రామ్ సేవలను కొనియాడారు. ఆయన విగ్రహానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. భారత దేశంలో ప్రధానమంత్రి ఎన్విరాన్మెంటల్ మీద చాలా కాన్సన్ట్రేషన్ చేస్తా ఉన్నాడు. నరేంద్ర మోడీ చెప్పినట్టు వెల్త్ ఇండియా హెల్త్ ఇండియా ఆర్గనైజ్ చేస్తూ, ఈ దేశాన్నికి భారత పౌరులు అందరు కూడా ఒక మంచి దేశ పౌరులుగా ఉండాలి. వారు అన్ని విధాల ఆరోగ్యంగా ఆనందంగా రాజకీయంగా సాంఘికంగా రంగాల్లో వాళ్లు ముందుకు పోవాలి. రేపు రాబోయే భవిష్యత్తు వాళ్లదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బిజెపి శ్రేణులు, నేతలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో మోసం.. మహిళ అరెస్టు

**ఆదిలాబాద్, మహా:** నకిలీ పత్రాలు సృష్టించి దంపతులను మోసం చేసిన కేసులో ఇద్దరిపై రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ ఫణిధర్ తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన నిందితులు దాసరి జ్యోతి, మహమ్మద్ కలీమ్ రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా వ్యవహరిస్తూ గెడం దేవిదాస్‌జ్యోత్స్న దంపతుల నుంచి రూ.3,30,000 వసూలు చేసి నకిలీ పత్రాలతో మోసగించారన్నారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు జ్యోతిని రిమాండ్‌కు తరలించామన్నారు.





## మంత్రులను కలిసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటీ శ్రీనివాస్ రెడ్డి, పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ని అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై రాజకీయ అంశాలపై చర్చించారు. ఆయన వెంట మాజీ ఎంపీ సోయం బాపురావు ఉన్నారు.

# భార్యను కడతేర్చిన భర్త

**ఆదిలాబాద్, మహా:** కట్టుకున్న భార్యను భర్త కడతేర్చిన ఘటన తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్ పోస్ట్ వద్ద కలకలం సృష్టించింది. తెలంగాణా, మహారాష్ట్ర సరిహద్దు అటవీ ప్రాంతంలో తన భార్యను దారుణంగా హత్య చేయగా.... పోలీసుల విచారణలో హత్య తానే చేశానని భర్త ఒప్పుకోవడంతో బాధిత కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.... వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన ఇంగోలి వందన గత నాలుగు రోజుల కిందట ఇంటి నుండి వెళ్ళడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో ఆదివారం మహిళ దారుణ హత్య జరిగిందన్న విషయం తెలుసుకుని విచారణ ప్రారంభించారు. భర్త శంకర్ పై సందేహంతో విచారించారు. విచారణలో హత్య తానే చేసినట్లు శంకర్ ఒప్పుకున్నాడని డీఎస్పీ జీవన్ రెడ్డి వెల్లడించారు.

# అన్నిటినీ అంగీకరించాలి

ఇష్టమున్నా లేకున్నా
కష్టమైనా కాకున్నా
ప్రవాహంలో తుంగలా వంగి ఉండాలి
నీళ్లు పోయాక తలెత్తుకు నిలబడాలి
ఏది ఏమైనప్పటికీ
అన్నిటికీ సంసిద్ధమై ఉండాలి

ముఖం లేకున్నా
అందంగా ఉన్నావు అనాలి
గూని వాడైనా కండ్లు లేని వాడైనా
బాగా చూడగలుగుతున్నావనాలి
ఏది ఎట్లయినా యధాతదంగా
స్వీకరించడం నేర్చుకోవాలి

ముందు మెచ్చుకొని
వెనక ఎత్తేసే వాళ్ళు వుంటారు
నోరు తో నవ్వి
నొసలుతో ఎక్కిరించే వాళ్ళు ఉంటారు
ఎవరు ఏమి అనుకున్నా
ఆమోదించడం అభ్యసించాలి
అన్నిటిలో "చెంచా"లా
కలిసి మెలసి ఉండాలి
మాటలకు చేతలకు
పొంతన ఉండకూడదు
పరిసరాలకు అనుకూలంగా
మారి ఊసరవెల్లిగా మెదలాలి

ఏ ఒక్క దాన్నీ ప్రశ్నించక
జవాబుగా నిల్చోవాలి
మనసుకు దెబ్బ తగిలినా
'అమ్మా 'అనకూడదు
ఎప్పుడైనా ఎక్కడైనా ఎట్లైనా
ఉన్నది ఉన్నట్టు అనుసరించాలి

నీదైన ఉనికినీ వ్యక్తిత్వాన్నీ
కోల్పోవడమే వాళ్లకు కావాల్సింది
నీలా బతకక నీవై ఉండకుండా
గుంపులో గోవిందం కావాలి
ఏదీ ఏమైనప్పటికీ
ఉన్నది ఉన్నట్టుగా అంగీకరించాలి

కింద పడి మీద పడి బతకడం ముఖ్యం
లంగవో దొంగవో లఫంగవైనా
ఎదుటివారు మునిగి కొట్టుకపోతున్నా
బతుకు తెరువు ముఖ్యం

నిన్నటి వరకూ
వాని పల్లకి మోసినవారు
అన్నిటినీ నిసిగ్గుగా వదిలిపెట్టి
మళ్లీ వాళ్ళే వీరి కాపు కాస్తారు
గాడిదైనా గుర్రమైనా
ఎవరికి లేని బాధ నీకెందుకు
ఎవరి బాధ వారు ఎవరి దారి వారు
అనుసరించాలి ఆమోదించాలి
మారు మాట్లాడక అంగీకరించాలి అంతే!

-జూకంటి జగన్నాథం

సాహిత్య అకాదెమీ
Ministry of Culture
Government of India
సాహిత్య అకాదెమీ
ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
సంయుక్త నిర్వహణలో
దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి
సదస్సుకు సాదర ఆహ్వానం
బుధవారం, 9 జులై 2025
ఆజమ్ హాల్, ప్రభుత్వ సిటీ కళాశాల, హైదరాబాద్
శతజయంతి
కార్యక్రమం
ప్రారంభ సమావేశం : ఉదయం 10.00 గం. నుండి 11.30 గం. వరకు
స్వాగతోపన్యాసం : సి. మృణాళిని, సంచాలకులు, తెలుగు సలహా మండలి, సాహిత్య అకాదెమీ
కీలకోపన్యాసం : నందిని సిధారెడ్డి, ప్రముఖ తెలుగు కవి
ముఖ్య అతిథి : పి. బాలభాస్కర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ సిటీ కళాశాల
గౌరవ అతిథి : ఇందిర గౌరీశంకర్, దాశరథి కుమార్తె
అధ్యక్షత : కోయి కోటేశ్వరరావు, తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల
టీ విరామం
మొదటి సమావేశం : ఉదయం 11.45 గం. నుండి 1.15 గం. వరకు
అధ్యక్షత : జె. నీరజ
పత్ర సమర్పకులు : గంగ్ర లక్ష్మణ రావు / దాశరథి పద్య కవిత్వం
ఏనుగు నరసింహారెడ్డి / దాశరథి వచన కవిత్వం
ఆర్. సీతారామారావు / దాశరథి కవితా శిల్పం
భోజన విరామం
రెండవ సమావేశం : మధ్యాహ్నం 2.00 గం. నుండి 3.30 గం. వరకు
అధ్యక్షత : కాకునూరి సూర్యనారాయణమూర్తి
పత్ర సమర్పకులు : సిద్దెంకి యాదగిరి / దాశరథి పాటలు
సమ్మెట విజయ / దాశరథి వచన సాహిత్యం
కె. ప్రభాకర్ / దాశరథి అనువాద సాహిత్యం
గరిపెల్లి అశోక్ / దాశరథి బాల సాహిత్యం
టీ విరామం
ముగింపు సమావేశం : మధ్యాహ్నం 3.45 గం. నుండి 4.30 గం. వరకు
అధ్యక్షత : అవధానం సుజాత
ముగింపు సందేశం : మామిడి హరికృష్ణ, నిర్దేశకులు, భాషాసాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం
RSVP : 080-22245152
Email: secretary@sahitya-akademi.gov.in / rs.rob@sahitya-akademi.gov.in
Website : www.sahitya-akademi.gov.in

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# కాసేపు సాంప్రదాయక శైలి కాసేపు ప్రయోగాత్మక శైలి

**చిన్న పిల్లాడు -**
**వానకు ఎదురుగా**
**ఒంటెలు పోస్తూ**


**నిన్ననే ఖాళీ**
**అయిన ఎదురిల్లు -**
**శిశిర సంధ్య**


**పాటలు లేవు -**
**ఎండుటాకులమీద**
**మంచు కణాలు**

హైకు రచన కానీ, చదవాలనే కోరికగాని మన జీవితంలో ఎదురైన ప్రాకృతిక అనుభవాలను , అనుభూతులను , కదిలించిన సుందర దృశ్యాలను చిత్రీకరించడం ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది . ఏ సృజనకైనా సృజనకారుడితో పాటు ఆ సృజనను దర్శించడానికి ఓ ప్రేక్షకుడు, పాఠకుడు అవసరం . హైకు పాఠకుడికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుంది . హైకు కవికి సమానస్థాయిలో పాఠకుడి ఆలోచనా సరళి ఉండాలి . అప్పుడే హైకు ఆస్వాదించగలుగుతాడు . జపాన్ సాంప్రదాయ శైలి ప్రకారం హైకు 575 మాత్రల సంఖ్యతో మూడు పాదాల రూప నిర్మాణం , ఋతు సంబంధమైన పదం (Kigo) ప్రధానంగా కలిగివుంటుంది. తూర్పు దేశాల (జపాన్ , చైనా , కొరియా ) కవులను అనుసరించి వారు నిర్దేశించిన లక్షణాల వైపు హైకు కవులు, పాఠకులు ఆకర్షించబడ్డారు . ప్రముఖ ఆంగ్ల కవులు, విమర్శకులు, హైకు కవులు ప్రత్యేకంగా అధ్యయనం చేసి జపానీయ హైకును ఇతర భాషల్లో వారి నియమాలననుసరించి రాయడం సాధ్యమేనా ? అన్న ఆలోచన చేశారు . ఫలితంగా హైకు ప్రక్రియ అనేక మార్పులు చెంది ఆధునిక రూపాన్ని సంతరించుకుంది

హైకు లక్షణాలు , తత్వం తెలిసి తెలుగులో రాసిన అతి తక్కువ కవుల్లో గాలి నాసర రెడ్డి గారు ఒకరు . ఇతర భాషల నుండి హైకు అనువాదాలు చేసినా వాటి ఎంపిక జాగ్రత్తగా చేసుకొని అనువదించిన తీరు కనబడుతుంది . పై హైకులు పరిశీలిస్తే ప్రారంభంలో నాసరరెడ్డి గారు సాంప్రదాయ శైలిని యిష్టపడి 575 మాత్రలు , ఋతుసంబంధమైన పదాల (Kigo) ప్రయోగం ( మంచు కణాలు , శిశిర సంధ్య , హేమంతం ) అలాగే క్లుప్తతను పాటించడం కనిపిస్తుంది .

మొదటి హైకు చదవగానే, చిన్న పిల్లాడు ప్రకృతిని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ , అమాయకత్వాన్ని ప్రదర్శిస్తున్న ఒక స్పష్టమైన దృశ్యం మన కళ్ళ ముందు ప్రత్యక్షమవుతుంది. హైకు ప్రధాన లక్ష్యం ఆ సంఘటన లేదా దృశ్యం పాఠకుడి మదిలో పటం కట్టించాలి . ఆ విశిష్టత ఇక్కడ కనబడుతుంది . ఒక సాధారణమైన మానవ అనుభవం నుండి తాత్వికమైన అనుభూతికి చేరడం కనిపిస్తుంది .




రెండవ హైకు లో రెండు దృశ్యాలు ఒకటి ఖాళీ అయిన ఇల్లు , రెండవది శిశిర సంధ్య మన కళ్ళ ముందు ప్రత్యక్షమవుతాయి. ఈ రెండు దృశ్యాల మధ్య space సృష్టించబడింది. ఈ space లో పాఠకుడు తన అనుభూతి లేదా సంవేదనను జోడించి సమన్వయం చేసుకోచ్చు. ఈ లక్షణాన్ని సుసాన్ ఆంతొలిన్ ( Susan Antolin ) అనే హైకు విమర్శకురాలు 'Understatement technique'గా వివరిస్తుంది .

'19 కవితలు' సంపుటిలోని హైకు
సంధ్యాతటాకం
రహస్యాలు దాగిన
నీడల పూలు . . . ఈ హైకు బషో ప్రసిద్ధ హైకు 'Old Pond 'ను గుర్తుకు తెస్తుంది .

**అర్ధరాత్రి**
**చలి -**
**పక్కింట్లో తుమ్ములు**

**మునుపెన్నడూ చూడని రంగుల పిట్ట**
**వింతగా చూస్తుంటే**
**తెల్లగా రెట్ట వేసింది**

పాశ్చ్యాతులు మొదటగా సాంప్రదాయ శైలి వైపు ఆకర్షించబడినా కాలక్రమంలో ఆంగ్ల భాషా స్వరూప స్వభావాల కారణంగా మాత్రల నియమాన్ని పాటించడం కష్టమని గుర్తించి మాత్రల సంఖ్య ప్రధానం కాదు అన్న నిర్ణయానికి వచ్చారు. ప్రకృతిని , సౌందర్యాన్ని ఆస్వాదించడానికి మానవ స్వభావానికి అతీతంగా ఉండాల్సిన అవసరం లేదు . గాలి నాసర రెడ్డి గారి హైకు పదాడంబరత్వం లేకుండా సరళమైన పదాలతో, పద దృశ్యాలతో చిత్రిక పడతాయి. హైకు సారం అంటే కవి ప్రకృతిలోకి , పరిసరాల్లోకి సహజ సంవేదన , అనుభూతితో తొంగి చూడటం , అనుభవాన్ని తనలోకి ఒంపుకోవడం. నాసర రెడ్డి కవిత్వంలో ఈ లక్షణాలు స్పష్టంగా కనబడతాయి.



డా . రూప్ కుమార్ డబ్బీకార్,
91778 57389

**లీ బో, బషో లు**
**చూసిన చందమామే**
**నా కళ్ళ ముందు**

మానవ సమాజాన్ని ఒక్కటిగా వుంచేది సార్వత్రికత . చందమామ సౌందర్యాన్ని , వెన్నెలని లీ బో, బషో లు ఆనందించినట్లుగానే ఇక్కడ కవి ఆస్వాదిస్తున్న తీరు పై హైకు లో వ్యక్తమవుతోంది . ప్రాకృతిక సౌందర్యం అందరికి అన్న ఒక నైతిక విలువను, ప్రజాస్వామిక భావనను సూచనాత్మకంగా చెప్పడం హైకు లాక్షణికత. 'కాసేపు ఎండలో కాసేపు నీడలోని హైకులు 1991 2025 సంవత్సరాల మధ్య రాసినవని కవి చెప్పుకున్నాడు. ఈ 30 35 సంవత్సరాల కాలపరిధిలో హైకు సాంప్రదాయ శైలి నుండి ప్రయోగాత్మక హైకుగా పరిణామం చెందిన తీరును గమనించవచ్చు . తూర్పు దేశాల హైకు కవుల వ్యక్తీకరణ నుండి పశ్చిమ దేశాల కవుల చేతిలో సమకాలీన హైకుగా మార్పు చెందుతూ కొత్త కవుల చేతిలో ఆధునిక హైకుగా రూపు సంతరించుకుంటున్నదశలు ఆంగ్ల సాహిత్యంలో చూడవచ్చు . ఆ మార్పుల ను, పరిణామశీలతను తెలుగులో, ఇతర భారతీయ భాషల్లో కూడా గమనించవచ్చు. ఆ మార్పులకు గాలి నాసర రెడ్డి గారి హైకు మినహాయింపు కాదు .


# బీసీ జీవితాలపై నవలలు ఇంకా రావాలి!

ఆకలి, నిద్రలను పక్కనబెట్టి మానవ జీవన సౌలభ్యాన్ని అందించే వృత్తి జీవులు చరిత్రలో కొస వరుసలోనూ కానరారు. వారి శ్రమను, వృత్తి విశిష్టతను పరిగణనలోకి తీసుకోకుండానే కాలం అడుగులపై చరిత్ర లిఖించబడుతూనే ఉంది. నిజానికి ప్రతి వృత్తి ఒక విద్యనే. పుస్తకాల్లో దొరకని చదువు అది. ప్రతి వృత్తి హస్తకళనే. వాటి తయారీలన్నీ కళారూపాలే. చాలా చేతి వృత్తులు రాయబడని శాస్త్రాలే. ప్రతి ఇల్లు ఒక ప్రయోగశాల. అలాంటి కుల వృత్తే బతుకై వందలాది ఏళ్ళు చదువంటే ఏమిటో తెలియని కాలంలో బీసీల జీవితాలు గడిచాయి.

నిజానికి రాజ్యాంగం ఈ కులవృత్తి జీవులను ఒక్క గాటన కట్టింది కానీ అంతకు పూర్వం సమాజంలో బీసీలందరికి సమానమైన మర్యాద లభించలేదు, లభించడం లేదు కూడా. చేసే పని ఈ మర్యాదకు అడ్డమస్తోంది. తోటి బీసీలయినా చాకలి, మంగలి వాళ్లు ఇతర బీసీల ఇంట్లోకి రావడానికి ఇంటెనుక తలుపే దిక్కు. గ్రామాల్లో ఇప్పటికీ ఈ ఆనవాయితీ కొనసాగుతుండొచ్చు. అయితే చేతివృత్తుల కులాలు అన్ని వెనుకబడినవే అని రాజ్యాంగం భావించింది. సామాజికంగా వాటికి దక్కుతున్న మర్యాద, ఆర్థికంగా వాటి స్తోమతను బట్టి ఏ బి సి డి ఈ లుగా విభజించి వాటి ఉన్నతి కోసం బాటలు వేసింది. దాని ఆధారంగా రిజర్వేషన్లు స్థిరీకరింపబడ్డాయి. ఆ ఫలాలు అందుకోవడానికి మొదటి తరానికి కనీసం పాతిక సంవత్సరాలు పట్టి ఉండవచ్చు. అలా విద్యావంతులైన బీసీల్లో 'తెలుగు సాహిత్యంలో ఏముంది, వాటిలో తమ ప్రస్తావన ఎంతవరకుంది, ఆ ఖాళీని పూరించేందుకు తామేంచెయ్యాలి' అనే ఆలోచన మొదలైంది.

అలా వచ్చిన బీసీల సాహిత్యాన్ని అవలోకిస్తే అది రాశిలో రావలసినంతగా రాలేదని అర్థమవుతోంది. చీకటిగా మిగిలిన బీసీల చరిత్రపై వెలుగులు చిమ్మే అవసరం ఎంతో ఉంది. ఈ లెక్క తేల్చేందుకే అన్నట్లు కె పి అశోక్ కుమార్ 'తెలుగులో బీసీ కులాల సాహిత్యం నవలలు' అనే పరిశోధనాత్మక సమాచారాన్ని మన ముందుంచారు. వీరి క్రోడీకరణ ప్రకారం బీసీ జీవితాలపై సుమారు యాభై నవలలు వచ్చాయన్న విషయం తెలుస్తోంది. పద్మశాలి, గౌడ కుల వృత్తులపై ఎనిమిది చొప్పున వచ్చాయి. మొత్తానికి చూస్తే వందకు పైగా ఉన్న బీసీ కులాల్లోంచి సగం కులాలపై కూడా రచనలు రాలేదని తెలుస్తోంది.

ఒక్కో నవలపై కెపి అశోక్ కుమార్ లోతైన విశ్లేషణ చేశారు. నవల ప్రాధాన్యతని, రచయిత ఉద్దేశ్యాన్ని పసిగట్టి వివరించారు. బీసీ కులాల్లో ఒక్కోదాని జీవనవిధానం, కాలంతో వచ్చిన మార్పులు, వర్తమాన స్థితిగతులు నవలల్లో ప్రతిబింబించిన తీరును రచయిత చక్కగా పేర్కొన్నారు. కులవృత్తి ప్రధానంగా రాసినా నవల ఆ బాధ్యతను ఎంతవరకు నిర్వర్తించింది అనే విషయాన్నీ కూడా రచయిత




స్పష్టం చేశారు. వ్యక్తిగా రచయితకున్న సహజ మానవోద్వేగాలు కూడా ఈ వాక్యాల్లో కదలాడుతాయి. నవలా వస్తువు, పాత్రల పరంగా వివిధ బీసీ కులాల వృత్తుల, జీవన పరిస్థితులను ఒకే చోట తెలుసుకొనే అవకాశం ఈ పరిశోధనా గ్రంథం కలిగిస్తోంది.

పద్మశాలీలపై లోక మలహరి రాసిన 'సంఘం' నవలలో కులస్తులను ఉద్ధరించడానికి ఏర్పడిన కుల సంఘాలు చివరకు తోటి కులస్తులనే పీడించి, పంచాయతీల్లో దండుగలు వసూలు చేసి తప్ప తాగడం గురించి వివరించారు. నేత కార్మికులపై వచ్చిన మరో నవల 'ముత్యాలపందిరి' లో కులవృత్తులు చేసుకొనేవారిలోనే కొందరు దళారులు ఏర్పడి, మిగిలినవారిని దోపిడీ చేయడమనేది వర్గ సమాజంలో ఒక సహజమైన పరిణామం అనే అంశాన్ని ఎత్తి చూపారు. వనం నరసింహారావు నవల 'జారీపూలు' ప్రేమలు, పెళ్లిళ్ల చుట్టూ తిరుగుతుంది కాబట్టి దీనిని నేత వృత్తి జీవితాన్ని చిత్రీకరించిన నవలగా చూడలేము అని తీర్మానించారు. కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా'లో పద్మశాలి జీవితాలను ఆవిష్కరించిన తీరు రచయితను ఆకట్టుకుంది. నిత్య దారిద్ర్యంలో కూరుకుపోయిన నేతపనివారల జీవన పోరాటాన్ని, ప్రత్యామ్నాయాన్ని చూసుకోలేనివాళ్ళ నిస్సహాయ పరిస్థితిని ఒక చేనేత కుటుంబ నేపథ్యంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మి 'చిలకలంచు జరీకోక'లో చక్కగా చిత్రీకరించారని అశోక్ కుమార్ అభిప్రాయపడ్డారు. 'జీవనయానం' నవలలో రచయితగా బి ఎస్ రాములు బీసీ కుల స్పృహ కన్నా బీసీలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడానికి ఎక్కువ తపించిపోయారని అశోక్ కుమార్ పేర్కొన్నారు. గౌడ కులవృత్తిపై చెప్పుకోదగ్గ నవలలు వచ్చాయి. అందులో గీత వృత్తికారుడైన నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు', దుల్దుమ్మ' అనే రెండు నవలలు రాయడం విశేషం. దూదేకుల కులంపై వచ్చిన నాలుగు నవలలు వారి జీవితాల్లోని, పేదరికాన్ని, సామాజిక వివక్షకు అద్దం పట్టాయి. ఈ నవలలపై అశోక్ కుమార్ ఆవశ్యకమైన వివరణాత్మక చర్చ జరిపారు. సలీమ్ 'దూదిపింజలు' నవలలో ముస్లిం సమాజంలో దూదేకులవాళ్ళు ఎదుర్కొంటున్న వివక్షపై సాధికారిక కథాకథనం ఉంది.

'సాంబయ్య చదువు' నవలలో కాలువ మల్లయ్య గొల్ల కులస్తుల అవమానాలను ప్రతిభావంతంగా చిత్రీకరించారని రాశారు. సుంకోజి రవీంద్రాచారి రాసిన 'రెక్కాడినంత కాలం' రచయిత ఆత్మకథాత్మక నవలగా భావించవచ్చని చెప్పడాన్ని ఒప్పుకోవచ్చు. కంచరలపై వచ్చిన సరికొత్త నవల 'పరంపర'. శిరంశెట్టి కాంతారావు రాసిన ఈ నవలలో వృత్తి పదికాలాలు నిలవాలంటే కాలంతోపాటు మనుషులు కూడా మారాలనే సందేశం అందరికి నచ్చిన అంశం. వివినమూర్తి రాసిన 'విమానం వచ్చింది' నవలలో గోల్డ్ కంట్రోల్ తెచ్చిన సమస్య, సంక్షోభాలే ప్రధానపాయగా సాగాయని అన్నారు. పైకి క్రైస్తవులు, లోపల దాగి ఉన్న పూర్వపు హిందూ కుల జాడ్యం 'మైల'లో బయటపడింది. ఆంధ్ర తీర ప్రాంతంలోని జాలరుల జీవితాలపై మూడు నవలలు వాస్తవానికి దగ్గర ఉన్నాయని చెప్పవచ్చు. వడ్డీ వ్యాపారస్తుల దోపిడీ, తూర్పు తీరం నుండి పడమరకు వలస, సాగర కాలుష్యం, వలల తయారీ తదితర అంశాల చర్చ వీటిలో ఉంది. ముదిగంటి సుజాతా రెడ్డి రాసిన 'సంకెళ్లు తెగాయి ' నవలలో కేవలం సానుభూతి తప్ప మంగలి వాళ్ల సమస్యల పట్ల అవగాహన లేని అగ్రవర్ణ రచయితల దృష్టికోణం కనబడుతుందన్నారు.

సరికొత్త అంశాన్ని ఎంచుకుని బీసీ నవలల సమాచార సేకరణ, వాటి వివరణలో ప్రామాణికతను నిలిపి కె పి తన రచనా వ్యాసంగం లో మరో విశేష రచనను జోడించారు. దేని ప్రత్యేకత దానికి కాపాడే విధంగా అశోక్ కుమార్ చేస్తున్న సాహితీ సేద్యం తెలుగు సాహిత్య చరిత్రకు, పరిశోధకులకు తప్పకుండా మేలు చేస్తుంది.

- బద్రి నర్సన్, 9440128169

**తెలుగు సాహిత్యంలో బీసీ నవల**
**రచన : కె పి అశోక్ కుమార్**
**పేజీలు 180 , వెల : రూ 200 /-**
**ప్రతులకు తెలంగాణ పబ్లికేషన్స్**
**86399972160**

## సాగిపోతే చరిత్ర!

అప్పుడప్పుడెందుకో !
చెట్టుకొమ్మకు వేలాడదీసిన
పిట్టగూడులా వాలిపోతున్న మనసు...

ఆలోచనల ప్రవాహం ఆగినందుకో!
ఆగకుండా ప్రవహిస్తున్నందుకో!
మనసెందుకో అకస్మాత్తుగా...
ఆకాశంనుంచిపట్టుతప్పిన
నెలవంకలా....

చురుగ్గా ఉన్నపిచ్చుకల శరీరాలు
గట్టిగా గాలి వీస్తే ఈకలూడిపోతున్నట్లు
జారిపోతుందిలా..


ఎగిరెగిరి ఎంతోఎత్తికెళ్లి
గాలివాటంతో ఈదుతున్న
దారం తెగి తేలిపోతున్న
గాలిపటంలా...

కొమ్మలు తమంతతామే
కదులుకున్నా
అదేపనిగా రంగుమారి
రాలుతున్నఆకుల్లా... బహుశా
అచేతనంగా అందుకే
వాలిపోతుందేమో!

శరీరంలో మనసుందా?
మనసులో శరీరముందా?
తెలుసుకోవడం!
జీవరహస్యం...
జీవిరహస్యం

తనంతట తానే మండుతున్నఎండ
భూమినివేడెక్కించాలని
శాయశక్తుల ప్రయత్నం
అలసిపోకుండా ఆపకుండా కాస్తూనే...

ఏది స్తంభించకూడదు
ఆగిపోతేనే అంతం..
సాగిపోతే అనంతం...



- డా. బాణాల శ్రీనివాసరావు,
9440471423




# కాళేశ్వరంలో భక్తుల పుణ్యస్నానం

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తొలి ఏకాదశి పండుగను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉగాది తర్వాత ప్రజలకు తొలి ఏకాదశి పెద్ద పండుగ. ఆషాడ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు జరుపుకున్నారు. కాళేశ్వరం గోదావరి నదిలో భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు చేస్తున్నారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాళేశ్వరం దేవాలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. భక్తులు శివనామస్మరణతో కీర్తించారు. ఆదివారం సెలవు దినం కు తోడు ఏకాదశి పండుగ కావడంతో పుణ్యక్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సరస్వతి పుష్కరాలతో కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి భక్తుల సంఖ్య రోజుకు అధికమవుతోంది. గ్రామాలలోని దేవాలయాల్లో ఉదయం నుంచి భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం ముక్తేశ్వర ఆలయం, ఘనపూర్ లోని కోటగుల్లు, బొమ్మపూర్ లోని శ్రీ వెంకటేశ్వర ఆలయం, బొప్పారం లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయం, భూపాలపల్లి జిల్లా కేంద్రం మంజూరు నగర్ లోని శ్రీ వెంకటేశ్వర ఆలయం తో పాటు గ్రామాలలో గల దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

# పల్లెల్లో పీర్ల పండుగ... మతాలకతీతంగా మొహారం

- అల్వ ఆటలు.. అసైదుల పాటలు
- డప్పుల మోతలు.. పల్లె పల్లెన పండుగ
- మలిదముట్కలతో ఫాతేహాలు
- పీర్లను దర్శించుకున్న ప్రముఖులు...



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా కుల మతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు కలిసి జరుపుకునే మొహర్రం పండగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. మహ్మద్ ప్రవక్త మనవళ్ళు హసన్, హుస్సేన్ బలిదానానికి ప్రతీక అయిన మొహర్రం పండుగను ఆదివారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో కన్నులపండుగగా జరుపున్నారు... పీర్లచావిడి దగ్గర కొలువుదీరిన పీర్లను సందర్శించిన భక్తులకు చెక్కర, పాలతో తయారు చేసిన పానకాన్ని అలాగే ప్రసాదాలను పంచిపెట్టారు. చాదార్లను ముజావర్లకు సమర్పించి పీర్లకు అలంకరించి మొక్కులు తీర్చుకున్నారు.. అలాగే గ్రామములోని వీదులకు పీర్లను ఊరేగింపుగా తిప్పారు. అంతకంటే ముందు పీర్ల చావిడి ముందు అలయ్‌లో అగ్ని గుండం రాజేసి దానిచుట్టూ అలయ్, బలయ్ ఆడుతూ కాలక్షేపం చేశారు. కుల మతాలకతీతంగా గ్రామంలోని ప్రతి ఇంటి గడప చాదర్ దట్టి, తీర్థ ప్రసాదాలను తీసుకొని, పీర్లను గుమ్మం ముందు ఉంచి నీటితో పిల్లరను కాళ్లు కడిగించి ఆశీర్వాదం తీసుకున్నారు. ముజావర్ల ఆద్వర్యంలో ప్రార్ధనలు చేసారు.. భక్తులకు మొహర్రం యొక్క విశిష్టతను వివరించారు. అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల వివిధ గ్రామాల్లో పీర్ల పండుగ వారం రోజులపాటు కొనసాగింది. హిందూ ముస్లిం తేడాలేకుండా అందరూ కలిసికట్టుగా భక్తిశ్రద్దలతో ఉత్సాహంగా జరుపుకొన్నారు. భక్తులు పీర్లకు దట్టీలు సమర్పించి మలీద, మటికలతో ఫాతెహాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రంలోని పీర్లచావిడీ వద్ద పెద్దసంఖ్యలో భక్తులు అలావ్ చుట్టూగా చిందులు తొక్కుతూ అసోయ్‌దూలా అంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రందాకా పీర్లను ఎత్తుకొని ఆటలాడారు. పీర్ల పండుగ సందర్భంగా వివిధ రకాల వేషధారణలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రివేళ కులమతాలకు అతీతంగా అలయ్ ఆడుతూ సంబురాలు జరుపుకొన్నారు. సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన ప్రజలు, పీర్లకు మొక్కులు తీర్చకోవడానికి తిరిగి స్వగ్రామానికి చేరుకోవడం తో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. గ్రామంలో మాజీ ప్రజాప్రతినిధులు ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. గ్రామాలలో గ్రామ ప్రజలందరూ కలిసిమెలసి పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు యువకులు, పెద్దలూ ఉపవాస దీక్ష ఉన్నారు. గ్రామాల్లో ఇప్పటికి పీర్లచావిడి వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో నడవడం ఆనవాయితీతో గుండంలో నడిచారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తిలకించారు... ఊరేగింపు అనంతరం పీర్లను నిమజ్జనం చేశారు.


# తుర్కయంజాల్ లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి



**రంగారెడ్డి జిల్లా మహా:** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం భారతీయ జనతా పార్టీ తుర్కయంజాల్ శాఖ ఆధ్వర్యంలో ఆ మహనీయునికి నివాళులు అర్పించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి క్రమశిక్షణ కమిటీ సభ్యులు, బోసు పల్లి ప్రతాప్ హాజరై, శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బోసుపల్లి మాట్లాడుతూ.... ఒకే దేశంలో రెండు సంవిధాన్లు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు అనే నినాదంతో కాశ్మీర్ ఈ దేశంలోనే భాగం అని తెలియజేసిన మహోన్నతమైన వ్యక్తిని స్మరించుకోవడం జరిగింది. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్ష కార్యదర్శిలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

# వెయ్యి స్తంభాల దేవస్థానంలో తొలి ఏకాదశి పూజలు

## పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని దంపతులు



**హన్మకొండ మహా;** తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం హనుమకొండ లోని ప్రాచీన ప్రసిద్ధి గాంచిన వెయ్యిస్థంభాల ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వారి సతీమణి నాయిని నీలిమ రెడ్డి తో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**అనంతరం ఎమ్మెల్యే దంపతులు**

భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ, వారితో కలిసి భక్తిపూర్వకంగా మమేకమయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్ర భారతదేశ పౌరులకు ఆదర్శం



**భూపాలపల్లి, మహా :** శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్ర భారత దేశ ప్రజలకు ఆదర్శమని భారతీయ జనతా పార్టీ చిట్యాల మండలాధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆదివారం చిట్యాల మండల కేంద్రము లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆయన జీవితం దేశం కోసం పరితపించేదని దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి ముందుకు నడవాలి అనే ఆలోచన నుండి పుట్టినటువంటి జనసంఘ్ స్థాపించారన్నారు. భారతీయ జనతా పార్టీ గా అవతరించి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నటువంటి మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయన ఆలోచనలకు తగ్గట్టుగా ఆనాడు 370 ఆర్టికల్ ను రద్దు చేయాలని ఉద్యమాలు చేసి ప్రాణ త్యాగం చేసినటువంటి గొప్ప మహనీయుడని దేశంలో ఒకే ప్రధాని ఉండాలని దేశభక్తుడని ఒక రాజకీయ రాజనీతిజ్ఞుడుగా ఒక విద్యావేత్తగా అనేక సంఘసంస్కరణలో పాల్గొని దేశం ఒక ముఖ చిత్రాన్ని మార్చేయాలని కలలుగన్న మహనీయుడని ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, బిజెపి సీనియర్ నాయకులు గుండ సురేష్, సాదా సదానందం,రమేష్, రాయని శ్రీనివాస్, అనుప మహేష్, గుర్రపు రవి, వెంకటేశ్వర్లు, కలచర్ల కిషోర్ పాల్గొన్నారు.

# తెలంగాణ స్టేట్ లెవల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు

## ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ మహా;** హనుమకొండ లోని జవహర్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ జెండాను ఆవిష్కరించి, క్రీడల పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ "దేశానికి వెన్నుముక నేటి క్రీడాకారులు" అన్నారు. క్రీడా రంగంలో అభివృద్ధి సాధించాలంటే క్రీడా స్ఫూర్తి అత్యవసరం, ఓటమికి భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు.రాష్ట్రంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణ కేంద్రాలు, కోచింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రథమ ప్రాధాన్యతనిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం భారీ నిధులు కేటాయించిందని తెలిపారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను, కోచ్ లను వేదికపై అభినందించి, గుర్తింపుగా జ్ఞాపికలను బహూకరించారు.

# ఆర్థికాభివృద్ధే మహిళా సమాఖ్య లక్ష్యం



**భూపాలపల్లి, మహా :** ఆర్థికాభివృద్ధే మహిళా సమాఖ్య లక్ష్యమని, మహిళల అభివృద్ధికి ఎలాంటి సహకారం కావాలన్నా అందించడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో జనని మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిళలతో కలిసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మహిళలు ఆత్మగౌరవంతో బతుకుతారని తమ ప్రభుత్వం నమ్ముతోందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా స్వయం సహాయక సంఘాలను పునరుద్ధరించామని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదేవిధంగా, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేశామని గుర్తుచేశారు. వెయ్యి మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా మహిళలకు అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా స్వయం సహాయక ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి స్టాల్స్ ఏర్పాటు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

**త్యాగానికి ప్రతీక మొహర్రం**

త్యాగానికి ప్రతీక మొహర్రం అని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో జరిగిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కొరకు కష్టనష్టాలను భరించి, ఆత్మ బలిదానానికి కూడా సిద్ధపడిన మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుస్సేన్ జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే అన్నారు. పవిత్రమైన మొహర్రం రాష్ట్రంలో మత సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింలకు సంబంధించిన ఏ పండగకు లేనివిధంగా మొహర్రం (పీర్ల పండుగ)కు హిందువులు పెద్దసంఖ్యలో పాల్గొనడం ఈ పండుగకు ఉన్న ప్రత్యేకత అని ఎమ్మెల్యే చెప్పారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరిన బాలయ్యపల్లి బీఆర్ఎస్ నాయకులు...**

కొత్తపల్లిగోరి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఈరోజు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా, పార్టీలో చేరిన వారిలో వంగ యాదగిరి, వంగ కుమారస్వామి, దుండబోయిన భిక్షపతి, బట్టు రమేష్, వంగ రాజు తదితరులు ఉన్నారు.

# దేశ సమగ్రతకు తన ప్రాణాలు అర్పించిన మహానేత డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ



**వరంగల్ మహా;** డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గం ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయం నందు బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రతకు తన ప్రాణాలు అర్పించిన మహానేత అని ఏక్ దేశ్, ఏక్ నిషాన్, ఏక్ విధాన్' నినాదంతో కశ్మీర్ లో భారత రాజ్యాంగాన్ని అమలు చేయడానికి చేసిన పోరాటం చారిత్రాత్మకంగా నిలిచిపోయిందని ఆయన త్యాగాలు ఈరోజు యువతకి ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకులు సిద్ధం నరేష్, కర్నే రవీందర్, మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు, జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ కొమకుల నాగరాజు, బిజెపి నాయకులు మడిపల్లి నాగరాజు, నవీన్ బీమ్, చిమ్మని శ్రీకాంత్, బస్కుల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి త్యాగానికి ప్రతీక మొహర్రం

## కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** మత సామరస్యానికి త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం మంచాల మండలం, ఆరుట్ల గ్రామంలో జరిగిన మొహర్రం వేడుకల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. గ్రామంలో ముస్లిం హిందూ అనే భేదాభిప్రాయాలు లేకుండా, ప్రతి ఒక్కరు మొహరం పండుగను జరుపుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య, మార సురేష్, ఎన్నిదుల సురేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, ఎండి గాలేబ్, అజీమ్, జిలానీ, ఇమ్రాన్, గఫార్, జాఫర్, అర్షద్, కుకుడాల నరేందర్ రెడ్డి, పాండాల అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పులో ఘనంగా పీర్ల పండుగ

## మత సామరస్యానికి ప్రతీక మొహరం.. మంత్రి కొండా సురేఖ



వరంగల్ తూర్పు నియోజకవర్గం ఎల్బీనగర్ మోమిన్ పురా లో మొహరం వేడుకలు కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు సయ్యద్ వసీం, ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీల వద్ద ప్రార్థనలో మంత్రి కొండా సురేఖ, నగర మేయర్గుం డు సుధారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముస్లిం క్యాలెండర్ ప్రకారం ఈ మొహరం నెల ముస్లింలకు నూతన సంవత్సరం మొదలవుతుందని ఈ పండుగ గొప్ప చరిత్రకు నిదర్శనమని అన్నారు. మహమ్మద్ ప్రవక్త మనవళ్లు అయన హాసన్, ఇమామ్ హుస్సేన్ ధర్మం కోసం న్యాయం కోసం విముక్తి కోసం జరిగే పోరాటంలో తన ప్రాణాలను విడిచారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మతస్తులు మొహారం మాసంలో దుఃఖాన్ని బాధను స్మరించుకుంటారని ముఖ్యంగా ఈ మాసంలో ముస్లింలందరూ 7,8,9,10, తేదీ లలో ఇమామ్ హుసైన్ మరణాన్ని స్మరించుకుంటూ బాధలో ఉపవాసం కూడా ఉంటారని తెలిపారు. వరంగల్ తూర్పు లో ముస్లింలు ఎక్కువ శాతం ఉన్నారని కాబట్టే ఈ పండుగ ఇక్కడ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని మొహరం పండుగ సందర్భంగా పీరీలను తిలకించడానికి కుల మతాలకు అతీతంగా అన్ని మతాల వారు కలిసి ప్రార్థనలు చేయడం ఎంతో అభినందనీయం అన్నారు.




# వరంగల్ నగరంలో వైభవంగా బీరన్న బోనాల జాతర

## బోనం ఎత్తుకున్న మంత్రి సురేఖ, మేయర్

- బీరన్న బోనాల జాతరలో మూడు పార్టీల నేతలు
- బోనాల జాతర కు పోటెత్తిన భక్తజనం
- జాతర కు పోలీసు భారీ బందోబస్తు

**వరంగల్ మహా :** వరంగల్ నగరంలోని కరీమాబాద్, రంగసాయిపేట, ఓ సిటీ, ఉరుసు ప్రాంతాలలోని బీరన్న దేవాలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా అంగరంగ వైభవంగా బీరన్న బోనాల జాతర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాల జాతర కురుమ కులస్తులకు ఇలవేల్పు అయిన బిరన్న స్వామికి తొలి ఏకాదశి రోజునే స్వామివారికి బోనాల జాతరను నిర్వహించుకుంటారు. బోనాల జాతరకు జిల్లాల నుంచి ప్రజలు కరీమాబాద్ కు తండోప తండాలుగా విచ్చేసి గావు పట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండా సురేఖ తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి బోనం ఎత్తుకోవడంతో కమిటీ వారు బోనాలను ఇంటి నుండి వీధుల గుండా కురుమ కళాకారులు డిల్లెం బల్లెం డోలుతో విన్యాసాలు చేస్తూ డాన్సులు చేస్తూ తీసుకుంటూ ఒక దిక్కు చేరుకొని కురుమ ఒగ్గు పూజారులు డోలు కళాకారులు వేషధారణలతో డాన్సులు ఖడ్గాలతో విన్యాసాలు చేస్తూ బోనాలను ఆలయానికి చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల జాతరకు ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగరంలోని దేవాలయాల దగ్గర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దేవస్థానాల కమిటీ కరీమాబాద్ ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరే కృష్ణ, ఉరుసు ఆలయ కమిటీ చైర్మన్ మరుపల్లి రవి, ఓ సిటీ ఆలయ అధ్యక్షు డు కంచ సంపత్, కార్యదర్శులు పూజారులు పాల్గొన్నారు.

**బోనాల జాతరకు మూడు పార్టీల నేతలు**

ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన బీరన్న బోనాల జాతరకు ఇటు అధికార పార్టీ మంత్రి కొండా సురేఖ మరోవైపు ప్రతిపక్ష పార్టీల నేతలు, నాయకులు పాల్గొనే సరికి కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జాతర జరిగే ప్రాంతాల్లో మూడు పార్టీల నేతల ఫ్లెక్సీల తో బీరన్న జాతర రాజకీయ రంగు సంతరించుకుంది. బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, తో పాటు వారి అనుచర వర్గం, అలాగే బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు తో కలిసి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు బోనం ఎత్తుకొని స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకోగా ఇటు నాయకులు, కార్యకర్తలు, అటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# హస్తినాపురం చౌరస్తాలో శ్యాం ప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పించిన బీజేపీ నేతలు



**బాలాపూర్ మహా:** శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భం గా హస్తినాపురం చౌరస్తా లో చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన మాజీ అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ,ఎల్బీనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ సామ రంగారెడ్డి. శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవితం త్యాగాల తో కూడుకున్నదని సామ రంగా రెడ్డి తెలిపారు. జాతీయ వాద నినాదం తో దేశ భద్రత కోసం,దేశం కోసం, ఐక్యత కోసం నిరంతరం తపించిన వ్యక్తి అని సామ రంగారెడ్డి కొనియాడారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ కి నిజమైన నివాళి ప్రధాని నరేంద్ర మోడీ అర్పించారని కాశ్మీర్ 370 ఆర్టికల్ నీ రద్దు చేసి ఒకే దేశం,ఒకే రాజ్యాంగం అమలవుతుందని తెలియజేశారని తెలిపారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచింది కాంగ్రెస్ పార్టీ అని ఒక వర్గం కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని సామ రంగారెడ్డి విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్రం లో మోసపూరితమైన హామీలు ఇచ్చిందని హస్తినాపురం బీజేపీ జనరల్ సెక్రటరీ వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఇందిరమ్మ రాజ్యమంటే చీకటి పాలన అని,ప్రజా వ్యతిరేకత పాలన అని,పోలీసుల రాజ్యమని వెంకటేష్ గౌడ్ మండిపడ్డారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ జీవిత త్యాగాలను ఎవరూ మర్చిపోలేరని వెంకటేష్ గౌడ్ గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నయవంచన పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద రావు,హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్,మాజీ అధ్యక్షుడు నరేష్ యాదవ్,డివిజన్ జనరల్ సెక్రెటరీ అమర్ నాథ్ రెడ్డి, సెక్రెటరీ చందు,కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యకవర్గ సభ్యులు బొగ్గుల మాధవరెడ్డి,డివిజన్ వైస్ ప్రెసిడెంట్ అరుణ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం



**బాలాపూర్ మహా:** మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జిల్లెలగూడ లోని శ్రీ సత్య సాయి నగర్ కాలనీ లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ వ్యవస్థాపకులు,చైర్మన్ తులసి వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యం లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి రంగా రెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు హాజరై అమ్మ వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు తులసి ముఖేష్ ముదిరాజ్ తో కలిసి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులందరూ వచ్చిన అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మల్లేష్ యాదవ్, కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, మాజీ ఫ్లోర్ లీడర్ కీసర గోవర్ధన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కళ్లెం రాజేందర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కరుణానిధి, కార్పొరేటర్లు చెవ్వ శ్రవణ్, భీమ్ రాజ్, నీలా రవి నాయక్, ఇంద్రవత్ రవి నాయక్, అరుణ ప్రభాకర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ధ్యాసాని తిరుపతి రెడ్డి, విక్కీ సాగర్, తుమ్మల రమేష్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు రాఘవేందర్ ముదిరాజ్, కాశి రామ్ యాదవ్, రవీందర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, నిఖిల్ సింగ్, జెడి పవన్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేము


## డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బిజెపి నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వాంబాయ్ కాలనీలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్ యాదవ్ తో కలిసి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటనికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వినయ్ రెడ్డి మాట్లాడుతూ దేశ నిర్మాణం, సామాజిక న్యాయం, నాయకత్వంలో అయిన సేవలను గుర్తు చేస్తూ మొక్కలను నాటారు. పర్యావరణాని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో బిజెపి పార్లమెంట్ ఎస్సీ మోర్చా కన్వీనర్ జోగు రవి, ఆడికే రాజు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సిరెడ్డి, బిజెపి నాయకులు లక్ష్మి రెడ్డి,రవి కుమార్, అంజి , గణేష్, అరుణ్ కుమార్, బాబుజీ, గణేష్, శ్రీకాంత్, కొండల్య వ శంకర్, గౌరి, హనుమంత్ రెడ్డి, ప్రదీప్, నిఖిల్ బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డోర్లు ఓపెన్ చేస్తే బీజేపీలోకి రావడానికి ఇతర పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారు

## జిల్లా అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్



**బాలాపూర్ మహా:** శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బడంగ్ పేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామీడి వీర కర్ణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాల్గొని చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అర్బన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజ్ భూపాల్ గౌడ్,మహేశ్వర నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ........ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి రంగారెడ్డి జిల్లాలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా పని చేశామని భూపాల్ గౌడ్ తెలిపారు. వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ల వలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. రానున్న గ్రామపంచాయతీ, మున్సిపల్,జిహెచ్ఎంసి ఎన్నికల లో గెలిపే లక్ష్యంగా బీజేపీ పార్టీ పని చేస్తుందని తెలిపారు. బీజెపి పార్టీ కి తెలంగాణ ప్రజలు ఒక్కసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రామ్ చందర్ రావు నాయకత్వం లో 2029 జరిగే ఎలక్షన్ లో తెలంగాణ లో భారతీయ జనతా పార్టీ 100 స్థానం లో విజయం సాధిస్తామని భీమా వ్యక్తం చేశారు. ఇతర పార్టీ నాయకులు బీజేపీ లోకి రావడానికి ఎదురు చూస్తున్నారు అని తమ వద్ద సమర్థవంతమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, బీజెపి నేతలు సూర కర్ణ రెడ్డి, మద్ది రాజశేఖర్ రెడ్డి,కోలన్ శంకర్ రెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తర్రే మలేష్ యాదవ్,అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు ఏనుగు ప్రభాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మా రెడ్డి,దడిగ శంకర్, బంగారు అనిత ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, అమిత శ్రీశైలం చారి, జక్కిడి మధుసూదన్ రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నవారు శ్రీనివాస్ రెడ్డి, ఎల్చల భాస్కర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు శూర కర్ణ రెడ్డి, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ మల్లేష్ యాదవ్, రాముడి మహేందర్ రెడ్డి, శశివర్ధన్ రెడ్డి, రాంబాబు గౌడ్, లక్ష్మీనారాయణ యాదవ్, బంగారు రవికాంత్, జంగా చారి, రోజా రాణి, శ్రీకాంత్ రెడ్డి, బిట్టు, సతీష్ నంద, పవన్ కుమార్ పటేల్, అడికె రవితేజ, శ్రీధర్ నాయక్, నరేందర్ చారి, కుమార్ చారి వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# త్యాగాలకు ప్రతీక ఈ పీర్ల పండుగ

## షాద్ నగర్ లో ఘనంగా పీర్ల ఊరేగింపు

### కుల మతాలకు అతీతంగా హాజరవుతున్న ప్రజలు

### భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు



**షాద్ నగర్, మహా:** కులమతాలకు అతీతంగా నిర్వహించే మొహరం పండుగ ఇస్లామిక్ నూతన సంవత్సరం లోని మొదటి నెలలో ఈ పండుగను జరుపుకుంటారు. తొమ్మిది రోజులపాటు నిలబెట్టిన పీర్లను మతసామరస్యాలకు అతీతంగా ప్రజలంతా ఏకమై ఘనంగా నిర్వహించుకునే పీర్ల ఊరేగింపుకు ఫరూఖ్ నగర్ మండల కేంద్రం వేదికయ్యింది. షాద్ నగర్ నియోజకవర్గం లోని ఫరక్ నగర్ మండల కేంద్రంలో పీర్ల పండుగను ముస్లింలతో పాటు హిందువులు ఎంతో వైభవంగా జరుపుకుంటున్నారు. ఫరక్ నగర్ లో మొత్తం 8పీర్ల మసీదులలో మధ్యాహ్నం నుంచి ఒక్కో పీర్ ఊరేగింపుగా బయలుదేరడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. కలిసిమెలిసి నిర్వహించుకుంటున్న ప్రజలు తమ మొక్కులను చెల్లించుకుంటున్నారు. మసీదులో పీర్ల చావిడిలా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఇస్లాం ధర్మ ప్రవచనాలు మహమ్మద్ ప్రవక్త బోధనలను వివరించారు. మొహరం మానవ విలువలు, న్యాయం, ధర్మ కోసం నిలబడటం, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం వంటి సందేశాలను ఇస్తుందని హుస్సేన్ త్యాగం ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నది వారు పేర్కొన్నారు. షాద్నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్ నిర్వహించారు.

# బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు




**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్పల్లి డివిజన్ అరాంఘర్ చౌరస్తా వద్ద మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆదివారం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయుడు, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్. స్వాతంత్ర్య సమర యోధుడిగా, సంఘసంస్కర్తగా రాజకీయ నాయకుడిగా దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. 1935 అక్టోబర్ 19న దళితులకు ఓటు హక్కు కోసం హమ్మండ్ కమిషన్ ముందు వాదనలు వినిపించారు. బ్రిటిష్ అధికారులపై అసమ్మతి చర్యలతో 1940లో అరెస్టయ్యారు. రాజ్యాంగ సభలో సభ్యుడిగా ఆయన పాత్ర ఎనలేనిది. దళితుల సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఆయన వాదించారు. 1946లో జవహర్ లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వ కేబినెట్లో అతి చిన్న వయసులో మంత్రి అయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశానికి తొలి కార్మిక మంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. 1940 నుంచి 1977 వరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అనుబంధ సభ్యునిగా, 1948 నుంచి 1977 వరకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రతినిధిగా కూడా పనిచేశారు. కమ్యూనికేషన్స్, రైల్వే, రవాణా, ఆహార, వ్యవసాయం, రక్షణ వంటి కీలక శాఖల బాధ్యతలు నిర్వహించారు. దేశంలో హరిత విప్లవం విజయవంతం చేయడంలో జగ్జీవన్ రామ్ కీలకపాత్ర పోషించారు. అలాగే జనతా పార్టీ ప్రభుత్వంలో 1977 నుంచి 1979 వరకు ఉప ప్రధానమంత్రిగా పనిచేశారు.

# పేదలకు ఇస్తామన్న నెలకు రూ.2500ల హామీ ఏమయ్యింది



**షాద్ నగర్, మహా:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు రంగారెడ్డి మహాసభలు ముగిశాయని రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5, 6 తేదీలలో రంగారెడ్డి 9వ జిల్లా మహాసభలు షాద్ నగర్ పటణంలోని పెన్షనర్స్ భవనంలో జిల్లా అధ్యక్షులు అంజయ్య అధ్యక్షతన జరిగాయని తెలిపారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మికులకు సంబంధించి పలు తీర్మానాలు ప్రవేశపెట్టి మహాసభ ఏకగ్రీవ ఆమోదం పొందిందని ఈ తీర్మానాలపై భవిష్యత్తు ఉద్యమాలు పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత రంగారెడ్డి జిల్లా సమితి పై ఉందని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను ఆయన తీవ్రంగా ఎండగట్టారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తామన్న నెలకు 2500 నేటికీ ఇవ్వడంలేదని ఇది ఎంతవరకు సమంజసం అని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే 2500 పేదల అకౌంట్ లో వెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహాసభ నూతన జిల్లా కౌన్సిల్ ను ఎన్నిక చేసింది 25 కౌన్సిల్ 13 కార్యవర్గం 9 మంది ఆఫీస్ బేరర్స్ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగిందని అధ్యక్షులుగా జే అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బుద్ధుల జంగయ్య ను మహాసభ తిరిగి అవకాశం ఇస్తూ కార్యనిర్వాక అధ్యక్షులుగా శివాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా పాలమాకుల జంగయ్య, శ్రీశైలం యాదవ్, జిల్లెల్ల వెంకటేష్, సహాయ కార్యదర్శిలుగా రమేష్ యాదవ్, స్వరూప జిల్లా కోశాధికారిగా ఎం కృష్ణ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. రంగారెడ్డి జిల్లాలో లో వ్యవసాయ కార్మికులు పేదల పక్షాన ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహించి సంఘాన్ని విస్తృతపరచాలని ఆయన నూతన నాయకత్వాన్ని అభినందించారు.

# యాంటీ రాబీస్ వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్ నగర్, మహా:** ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా షాద్ నగర్ ఏరియా వెటర్నరీ ఆసుపత్రి నందు నిర్వహించిన యాంటీ రాబీస్ వాక్సినేషన్ కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, ముక్కంటి రాజ్,కె సునీత, వంశీ కృష్ణ రెడ్డి వెంకటేష్,కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,ఫరూఖ్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అందే మోహన్ ముదిరాజ్,మురళీమోహన్(అప్పి) మహబూబ్, దిలీప్,సాయి కుమార్, సాయిలు ,ముబారక్ అలీ ఖాన్,తుపాకుల శేఖర్, మణికంత, కిట్టు తదితరులు పాల్గొన్నారు..

# సిటీ రియల్ ఎస్టేట్‌కి ఐటీ బూస్ట్..

**రియల్ ఎస్టేట్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) రంగం కీలకమైంది. మన సిటీ స్థిరాస్తికి ఐటీ బూస్ట్‌లాగా మారింది. ఐటీ ఉద్యోగులపై ఆధారపడి గృహ విక్రయాలు ఎంత జరుగుతాయో.. అంతకు రెట్టింపు స్థాయిలో ఐటీ సంస్థల లావాదేవీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమాది ప్రాంతాలకే పరిమితమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) ఆఫీస్ స్పేస్.. గ్రోత్ ఇన్ డిస్పర్షన్ (గ్రిడ్) పాలసీతో నగరం నలువైపులా విస్తరించింది.**



ఈ పాలసీలో భాగంగా ప్రభుత్వం ఔటర్ వెంబడి ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఉన్న 11 పారిశ్రామిక పార్క్‌లను ఐటీ పార్క్‌లుగా మార్చింది. దీంతో పాటు కొంపల్లిలో ఐటీ టవర్, కొల్లూరులో ఐటీ పార్క్‌లను నిర్మిస్తోంది. ఫలితంగా పశ్చిమం వైపున కాకుండా ఇతర ప్రాంతాలలో కొత్తగా 3.5-4 కోట్ల చ.అ. ఐటీ ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి రానుందని జేఎల్ఎల్ తెలిపింది. గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో హైదరాబాద్ దూసుకెళుతోంది. దేశంలోని ఇతర మెట్రో నగరాల కంటే గణనీయమైన వృద్ధి రేటు నమోదు చేస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతం 9.04 కోట్ల చ.అ. ఆఫీస్ స్పేస్ ఉన్న మన సిటీ.. ఈ ఏడాది ముగింపు నాటికి 10 కోట్ల చ.అ. మైలురాయిని దాటనుందని జేఎల్ఎల్ సర్వేలో తేలింది. ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో బెంగళూరు, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్ తర్వాత హైదరాబాద్ నాల్గో స్థానంలో నిలిచింది. కొంత కాలంగా కొంపల్లి, బాచుపల్లి, మేడ్చల్ వంటి ఉత్తరాది ప్రాంతాలు, ఎల్బీనగర్, ఉప్పల్, పోచారం వంటి తూర్పు ప్రాంతాలలో నివాస క్రయవిక్రయాలు జోరందుకున్నాయి. ఆయా ప్రాంతాలలోని అందుబాటు గృహాలను ఐటీ ఉద్యోగులు కొనుగోలు చేస్తున్నారు.

### 81 శాతం వృద్ధి రేటు..


కొన్నేళ్లుగా గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్లో హైదరాబాద్ నగరం మెరుగైన స్థానాన్ని నమోదు చేస్తుంది. హైదరాబాద్ తర్వాత రెండో స్థానంలో ఉన్న బెంగళూరు గత ఆరేళ్లలో 47 శాతం వృద్ధిని నమోదు చేసింది. దేశవ్యాప్తంగా అన్ని నగరాల్లోని గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ విభాగంలో హైదరాబాద్ నగర భాగస్వామ్యం ఇటీవలి వరకు 12.7 శాతంగా ఉండగా.. కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్పేస్‌తో 25 శాతానికి పెరిగింది.

### గ్రిడ్ పాలసీ అమలుతో..

గ్రిడ్ పాలసీతో నగరం నలువైపులా ఐటీ విస్తరించింది. డెవలపర్లకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను కూడా అమలు చేస్తోంది. మూడు సంవత్సరాల వ్యవధిలో 500లేదా అంతకంటే ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఐటీ, ఐటీఈఎస్ యూనిట్లకు యాంకర్ యూనిట్ ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఇందులో సంబంధిత భూమిని 50 శాతం ఐటీ, ఐటీఈఎస్ ప్రయోజనాల కోసం వినియోగించగా.. మిగిలిన సగంలో నివాస, వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించవచ్చనే వెసులుబాటు కల్పించింది. హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్ అనేది కేవలం రెండు ప్రధాన కారిడార్లలోనే కేంద్రీకృతమై ఉంది. హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాలు గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ మార్కెట్ ఇంజిన్లుగా పనిచేస్తున్నాయి. 96 శాతం స్పేస్ ఈ ప్రాంతాల నుంచే ఉంటుంది.

# స్టూడియో అపార్ట్‌మెంట్లకు తగ్గుతున్న గిరాకీ

కరోనా కంటే ముందు ఇల్లు అంటే నాలుగు గోడల భవనం. సంపాదన బిజీలో పడిన సగటు జీవికి కాసేపు సేద తీరాలనుకునే గూడు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి ఇల్లే ప్రపంచమైపోయింది. తినడం, పడుకోవడం మాత్రమే కాదు.. ఆఫీసు, స్కూల్, వ్యాయామం, వినోదం అన్నీ.. ఇంటి నుంచే! ఫలితంగా కోవిడ్ కంటే ముందు హాట్ కేకుల్లాంటి స్టూడియో అపార్ట్‌మెంట్లకు.. క్రమంగా డిమాండ్ పడిపోయింది. వీటి స్థానంలో విస్తీర్ణమైన గృహాలకు గిరాకీ పెరిగింది. బెడ్ కం లివింగ్ రూమ్, కిచెన్, అటాచ్‌డ్ బాత్‌రూమ్ ఉండే వాటిని స్టూడియో అపార్ట్‌మెంట్ అంటారు. కరోనా మొదలైన ఏడాది(2020) నుంచి దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ తరహా అపార్ట్‌మెంట్ల సరఫరా క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. ఈ ఏడాది తొలి అర్ధ వార్షికం(జనవరి-జూన్)లో 1,063 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో కేవలం 9 శాతం(91 ప్రాజెక్ట్‌లు) మాత్రమే స్టూడియో అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 1,207 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ కాగా.. ఇందులో 145 ప్రాజెక్ట్‌లు స్టూడియో పార్ట్‌మెంట్లున్నాయి. 2020లో 884 ప్రాజెక్ట్‌లు ప్రారంభం కాగా.. ఇందులో 15 శాతం వాటాతో 130 ప్రాజెక్ట్‌లు ఈ తరహా అపార్ట్‌మెంట్లున్నాయి. అలాగే 2019లో 1,921 ప్రాజెక్ట్‌లు లాంచింగ్ అయ్యాయి. 368 ప్రాజెక్ట్‌లు(19 శాతం) ఈ స్టూడియో ఇళ్లే..



**లొకేషన్ ముఖ్యం..**

స్టూడియో అపార్ట్‌మెంట్లను బ్యాచిలర్స్, పర్యాటకులు, వ్యాపార ప్రయాణికులు, యువ దంపతులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. విస్తీర్ణంతో కాకుండా లొకేషన్ ఆధారంగా డిమాండ్ ఉంటుంది. తరచూ ఇవి ఉపాధి, వ్యాపార కేంద్రాలు చుట్టూ, ఖరీదైన ప్రదేశాలలో ఎక్కువగా ఉంటాయని అనరాక్ గ్రూప్ సంస్థ తెలిపింది. కరోనా కారణంగా వర్క్ ఫ్రం హోమ్ సంస్కృతి మొదలైంది. దీంతో 2020 నుంచి పెద్ద సైజు ఇళ్లకు డిమాండ్ పెరిగినట్లు చెప్పింది.

**మన దగ్గర తక్కువే..**

స్టూడియో అపార్ట్‌మెంట్లకు ఉత్తరాది నగరాలలో ఉన్నంత డిమాండ్ దక్షిణాదిలో ఉండదు. ముంబై, పుణే నగరాలలో ఈ తరహా ఇళ్ల ట్రెండ్ నడుస్తోంది. 2013-20 మధ్య కాలంలో దేశంలోని 7 ప్రధాన నగరాలలో లాంచింగ్ అయిన స్టూడియో అపార్ట్‌మెంట్లలో 96 శాతం వాటా ముంబై, పుణేలదే.. ఇదే కాలంలో దక్షిణాది నగరాలైన బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో కేవలం 34 స్టూడియో ప్రాజెక్ట్‌లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది హెచ్-1లో 7 నగరాలలో ప్రారంభమైన 91 స్టూడియో ప్రాజెక్ట్‌లలో.. 71 ప్రాజెక్ట్‌లు ముంబైలోనే ఉన్నాయి. ఆ తర్వాత పుణేలో 18, బెంగళూరులో రెండు ప్రాజెక్ట్‌లు లాంచింగ్ అయ్యాయి.

# బజాజ్ కొత్త బైక్‌లు.. నాలుగు రైడింగ్ మోడ్‌లతో..


బజాజ్ ఆటో డామినార్ 400, డామినార్ 250 అప్‌డేటెడ్ వెర్షన్ బైకులను లాంచ్ చేసింది. రెండింటిలో డామినార్ 250 ప్రారంభ ధర రూ .1.92 లక్షలు (ఎక్స్‌షోరూమ్), డామినార్ 400 ప్రారంభ ధర రూ .2.39 లక్షలు (ఎక్స్‌షోరూమ్). వీటికి సంబంధించిన వివరాలను బజాజ్ ఆటో ఇటీవల టీజ్ చేసింది. అప్‌డేట్‌లలో భాగంగా ఫీచర్లలో బజాజ్ సంస్థ మార్పులు చేసింది. మరిన్ని టూరింగ్ పరికరాలను జోడించింది. డిజైన్‌లో పెద్దగా మార్పులేమీ లేకుండా రైడర్ సౌకర్యం కోసం కొన్ని స్వల్ప సర్దుబాట్లు మాత్రం చేసింది. రెండు డామినార్ బైక్‌లూ ఇప్పుడు నాలుగు రైడింగ్ మోడ్‌లతో వస్తాయి. అవి రెయిన్, రోడ్, స్పోర్ట్, ఆఫ్‌రోడ్. అవసరాన్ని బట్టి థ్రోటిల్ రెస్పాన్స్, ఏబీఎస్ ఇంటర్వెన్షన్ స్థాయిలను మార్చడం ద్వారా రైడర్‌కు ఈ మోడ్‌లు సహాయపడతాయి. ఇక డామినార్ 400 బైక్‌లో ప్రత్యేకంగా రైడ్‌బైవైర్ ఫీచర్ ఇచ్చారు. డామినార్ 250లో మాత్రం మెకానికల్ థ్రోటిల్ సెటప్, నాలుగు ఏబీఎస్ మోడ్స్ ఉన్నాయి. మరో ముఖ్యమైన మార్పు ఏమిటంటే, పల్సర్ ఎన్ఎస్ 400 జెడ్‌లో లాంటి డిజిటల్ డిస్‌ప్లేను ఈ రెండు డామినార్ బైక్‌లలో ఇచ్చారు. ఇది కొత్త స్విచ్ గేర్ తో పనిచేసే కలర్ ఎల్‌సీడీ బాండెడ్ గ్లాస్ స్పీడోమీటర్. ఎక్కువ దూరం బైక్ నడిపే రైడర్లకు మరింత సౌలభ్యం కోసం హ్యాండిల్ బార్‌లను కూడా మార్చినట్లు బజాజ్ పేర్కొంది. రైడర్లు తమ జీపీఎస్ పరికరాలు లేదా స్మార్ట్‌ఫోన్‌లను కనెక్ట్ చేసుకునేందుకు జీపీఎస్ మౌంట్‌ను చేర్చింది. ఇక మెకానిక్స్ పరంగా చూస్తే ఎటువంటి మార్పులు లేవు. డామినార్ 400 బైకులో 373 సీసీ లిక్విడ్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజన్ ఉంది. ఇది 8,800 ఆర్‌పీఎం వద్ద 39 బీహెచ్‌పీ పవర్, 6,500 ఆర్‌పీఎం వద్ద 35 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది 6స్పీడ్ గేర్ బాక్స్ తో వస్తుంది. అదే విధంగా డొమినార్ 250 విషయానికి వస్తే 248 సీసీ లిక్విడ్‌కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఉంది. ఇది 8,500 ఆర్‌పీఎం వద్ద 26 బీహెచ్‌పీ పవర్, 6,500 ఆర్‌పీఎం వద్ద 23 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీని ఈ ఇంజన్ కూడా 6స్పీడ్ ట్రాన్స్ మిషన్ తో జతై ఉంటుంది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# 'దళితులంటే అంత చులకనా? జగద్గురువుపై శశి థరూర్ విశ్లేషణ

'చెప్పే మనిషి.. వినే టైమ్‌ను బట్టి విషయం విలువే మారిపోతుంది'.. ఈ డైలాగ్ ఒక సినిమాలో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ రాసినది. దీని అర్థాన్ని విశదీకరిస్తే.. ఏదైనా విషయాన్ని చెప్పే మనిషికున్న విలువకు.. అదే విషయాన్ని వివరించే కాలానికి అనుగుణంగా దాని అర్థం మారిపోతుందని.. అంటే ఒకే విషయం వివిధ సందర్భాలలో, అప్పుడున్న కాలానికి అనుగుణంగా అర్థం అవుతుందని.. తాజాగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఆది శంకరాచార్యులు' గురించి చెప్పిన మాటలు విన్నప్పుడు త్రివిక్రమ్ రాసిన డైలాగ్ గుర్తుకువస్తుంది. 'జగద్గురువు' ఆది శంకరాచార్యులు దళితుల విషయంలో ఎలాంటి దృక్పథాన్ని కలిగి ఉన్నారనే విషయాన్ని ఎంపీ శశిథరూర్ ఒక వీడియోలో వివరించే ప్రయత్నం చేశారు. ఆది శంకరాచార్యులు 10వ శతాబ్దంలో హిందూ మతాన్ని పునరుద్ధరించిన మహనీయుడని శశిథరూర్ తొలుత పేర్కొన్నారు. ఒకరోజు ఆది శంకారాచార్యులు ఒక ఇరుకైన నది దాటుతున్నప్పుడు ఆయనకు ఒక ఛండాలుడు(దళితుడు) అడ్డుగా వస్తాడు. వెంటనే శంకరాచార్యులు అతనని అడ్డు తొలగాలని ఆజ్ఞాపిస్తారు. తాను మహనీయుడననే ఉద్దేశంతో శంకరాచార్యుడు ఆ విధంగా ఆదేశిస్తారు. అయితే ఆ ఛండాలుడు కదలకుండా అక్కడే నిలుచుని శంకరాచార్యులను ఇలా ప్రశ్నిస్తాడు. 'మీరు నా శరీరాన్ని తొలగిపొమ్మంటున్నారా లేదా ఆత్మను తొలగిపొమ్మంటున్నారా? అని అంటూ.. మన ఇద్దరి ఆత్మ ఒక్కటే కదా?" అని అడుగుతాడు. ఈ ప్రశ్న శంకరాచార్యులను తీవ్ర ఆలోచనకు గురిచేస్తుంది. అనంతరం ఆయన ఆత్మ సమానత్వంపై అంగీకారం తెలియజేస్తారు. ఆత్మ స్థాయిలో అందరూ సమానమేనని, దళితుడు కూడా అందరితో సమానమేనని ఆది శంకరాచార్యులు గుర్తిస్తారు. వెంటనే శంకరాచార్యులు ఆ దళితుడి పాదాలకు ప్రణమిల్లుతూ.. నా బోధనలను నా శిష్యుల కంటే మీరు చక్కగా అర్థం చేసుకున్నారని ప్రశంసిస్తారు. ఈ సంఘటనను చెప్పిన శశిథరూర్ అన్ని జీవరాశులు ఒకే ఆత్మలోని భాగాలేనని, ఇవన్నీ బ్రహ్మలో కలిసేందుకు ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. జన్మ ఆధారంగా వివక్షకు తావులేదని శశిథరూర్ స్పష్టం చేశారు. శశి థరూర్.. శంకరాచార్యులు జీవించిన కాలంలోని సామాజిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకుని, ఆ కాలంలో కుల వ్యవస్థ బలంగా ఉండేదని, వాటి సంస్కరణల కోసం ఆయన చర్యలు తీసుకోలేదని, ఆయన దృష్టి ప్రధానంగా ఆధ్యాత్మిక, తాత్త్విక బోధనలపైనే ఉందన్నారు. ఆయన తాత్త్వికంగా సమానత్వాన్ని బోధించినప్పటికీ, సామాజిక ఆచారాలకు కొంతవరకు కట్టుబడి వ్యవహరించారని శశిథరూర్ వ్యాఖ్యానించారు.







# పోల్ బాడీ కీలక నిర్ణయం.. ప్రతిపక్షాలకు ఉపశమనం

**పట్నా:** ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇంతలో 'పోల్ బాడీ' కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు కొద్ది నెలల సమయమే ఉన్న ప్రస్తుత తరుణంలో అధికార ప్రభుత్వం ఓటర్ల జాబితాను తీర్చిదిద్దడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. దీంతో ఎన్నికల సంఘానికి చెందిన పోల్ బాడీ ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గింది.

రాష్ట్రంలో ఓటరు నమోదుకు తప్పనిసరిగా పేర్కొన్న పత్రాలను సమర్పించకపోయినా, స్థానిక దర్యాప్తు ఆధారంగా కూడా వారి ధృవీకరణపై నిర్ణయం తీసుకోవచ్చని ఎన్నికల కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం తాజాగా రూపొందిస్తున్న ఓటరు జాబితాలో కోట్లాది మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించే అవకాశం ఉందని ప్రతిపక్షం గగ్గోలు పెట్టిన తరుణంలో ఎన్నికల సంఘం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. తప్పనిసరి పత్రాలను సమర్పించకుండానే బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఓటర్లు ఓటర్ల జాబితాలో ధృవీకరణ పొందవచ్చని ఎన్నికల కమిషన్ తెలిపింది. పత్రాలు లేనిపక్షంలో స్థానిక స్థాయిలో దర్యాప్తు ఆధారంగా ఎలక్టోరల్ రిజిస్ట్రార్ అధికారి ధృవీకరణ చేయనున్నారు.

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను ప్రతిపక్షాలు విమర్శించాయి. ఈ ప్రక్రియ బీజేపీ గెలిచేందుకు చేస్తున్న కుట్రగా అభివర్ణించాయి. అయితే దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్ ఓటర్లకు ఒక సూచన చేస్తూ.. అవసరమైన పత్రాలు, ఫోటో అందుబాటులో లేకపోతే, గణన ఫారమ్‌ను పూరించి బూత్ స్థాయి అధికారికి అందించాలని పేర్కొంది. వారు ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారితో మాట్లాడి, అందుబాటులో ఉన్న ఆధారాలు, ఇతర పత్రాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. ఎన్నికల సంఘం అందించిన డేటా ప్రకారం బీహార్‌లో ఇప్పటివరకు 1.21 కోట్ల మంది ఓటర్లు గణన ఫారాలను నింపి సమర్పించారు. జూలై 25 నాటికి ఈ ఫారమ్‌లను సమర్పించాల్సి ఉంది. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, అర్హత ఉన్న ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాలో భాగం అవుతారని పోల్ బాడీ పేర్కొంది.



# హిమాచల్‌లో 75 మరణాలు..

## వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధింపు

**సిమ్లా:** హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. ఎడతెరిపిలేని భారీ వర్షాల కారణంగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక, హిమాచల్‌లోని మండి జిల్లాలో భారీ వర్షాల కారణంగా మరణాల వారి సంఖ్య 75కు చేరుకుంది. మరోవైపు.. పలు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ విధించింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఒక్క రోజులో 115204 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 204 మిల్లీ మీటర్లు అతి తీవ్ర వర్షపాతం కిందకు వస్తుంది. దీంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. దాదాపు 240 రహదారులపై రాకపోకలు కష్టంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. ఆకస్మిక వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా మారింది. ఎడతెరిపిలేని వర్షం కారణంగా చాలా చోట్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోంది. వీటిల్లో ఒక్క మండి జిల్లాలోనే 176 మార్గాలున్నాయి.

**రెడ్ అలర్ట్ జారీ..**

హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రా, సిర్మౌర్, మండి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ విధించింది. అలాగే, రానున్న 24 గంటల్లో చంబా, కంగ్రా, మండి, శిమ్లా, సిర్మౌర్ జిల్లాల్లో మెరుపు వరదలు రావొచ్చని హెచ్చరించింది. ఉనా, బిలాస్‌పుర్, హమిర్‌పుర్, చంబా, శిమ్లా, కుల్లు జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. చాలా చోట్ల కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉందన్నారు. బలహీనమైన నిర్మాణాల్లో ప్రజలను ఉండొద్దని హెచ్చరించారు. మరోవైపు.. సహాయక చర్యల్లో ఐటీబీపీ దళాలు పాల్గొంటున్నాయి.

# కేంద్రానికి సుప్రీం కోర్టు లేఖ..

## చంద్రచూడ్ బంగ్లాను ఖాళీ చేయించాలంటూ..



ఢిల్లీ: సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అధికారిక నివాసం విషయమై కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ రాసింది. ఆయన అధికారిక నివాసాన్ని వీలైనంత త్వరగా ఖాళీ చేయించాలని కోరుతూ లేఖలో పేర్కొంది. జస్టిస్ చంద్రచూడ్ పదవీ విరమణ అనంతరం నిబంధనలకు విరుద్ధంగా అక్కడ ఉండటాన్ని సర్వోన్నత న్యాయస్థానం లేఖలో ప్రస్తావించింది. దీంతో, సదరు లేఖపై చంద్రచూడ్ స్పందించి కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే, ఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్‌లో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నివాసం ఉంటున్నారు. కాగా, ఈ బంగ్లాను అత్యవసరంగా ఖాళీ చేయించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు లేఖ రాసింది. ఈ క్రమంలో.. బంగ్లాను జస్టిస్ డీవై చంద్రచూడ్ నుంచి ఆలస్యం చేయకుండా స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాం. ఆయన పదవీ విరమణ అనంతరం బంగ్లాను ఖాళీ చేయాల్సిన గడువు ముగిసిపోయి కూడా ఆరు నెలలు అవుతోంది అని సుప్రీంకోర్టు.. హౌసింగ్ అర్బన్ అఫైర్స్ శాఖ కార్యదర్శికి రాసిన లేఖ రాసింది. ఇక, సుప్రీంకోర్టు రాసిన లేఖపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ.. 'కొన్ని వ్యక్తిగత అవసరాల కారణంగా ఆలస్యమైందన్నారు. త్వరలోనే బంగ్లాను ఖాళీ చేసి అధికారులకు అప్పగిస్తానన్నారు. కొన్ని పరిస్థితులు, తన కుమార్తెలకు ఉన్న ప్రత్యేక అవసరాల దృష్ట్యా అధికారిక బంగ్లా ఖాళీ చేయడానికి ఆలస్యమైందన్నారు. అలాగే, తుగ్లక్ రోడ్‌లోని బంగ్లా నంబర్ 14ను ప్రభుత్వం తనకు ప్రత్యామ్నాయ వసతిగా ఇప్పటికే కేటాయించినప్పటికీ.. పునరుద్ధరణ పనులు జరుగుతున్న కారణంగా అందులోకి మారలేదని వెల్లడించారు. భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చంద్రచూడ్ రెండేళ్ల పాటు సేవలందించిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్ 10న చంద్రచూడ్ పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసిన నాటి నుంచి జస్టిస్ చంద్రచూడ్ ఢిల్లీలోని ప్రధాన న్యాయమూర్తి అధికారిక భవనంలోనే నివాసం ఉంటున్నారు. దీంతో, అనంతరం సీజేఐగా విధులు నిర్వహించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఇద్దరూ కూడా అధికారిక నివాసంలోకి మారలేదు. ఈ కారణంగానే సుప్రీంకోర్టు లేఖ రాసినట్టు తెలుస్తోంది.




మహా పత్రిక





# సితారకు వార్ 2



హీరో ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు విడుదల హక్కులను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ''భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'వార్ 2'. ఇండియన్ సినీ హిస్టరీలో ఇద్దరు బిగ్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య ఉండేపోటీ ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీ స్పై యూనివర్స్‌లో భాగంగా మరో అధ్యాయంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'పఠాన్, టైగర్ 3, వార్' వంటి గ్లోబల్ హిట్ మూవీస్ తర్వాత వస్తోన్న 'వార్ 2' పై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమాని తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుండటం హ్యాపీగా ఉంది. ఆగస్ట్ 14న థియేటర్స్‌లో ఈ ఉత్సవం మొదలు కానుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ రిలీజ్ కానుంది'' అని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ పేర్కొంది.


# అర్ధరాత్రి అలాంటి మెసేజ్..



సెలెబ్రిటీల ప్రేమ, పెళ్లి విషయంలో నిత్యం ఏదో ఒక రూమర్ వస్తూనే ఉంటుంది. పెళ్లయ్యే వరకు డేటింగ్, ప్రేమ పుకార్లు చక్కర్లు కొడితే.. పెళ్లి తర్వాత కొన్నాళ్లకే ప్రెగ్నెన్సీ రూమర్స్ వినిస్తాయి. తండ్రి కాబోతున్న హీరో, తల్లి కాబోతున్న హీరోయిన్ అంటూ వార్తలు వస్తాయి. తాజాగా అలాంటి ప్రెగ్నెన్సీ పుకారే బాలీవుడ్ హీరోయిన్ సోనాక్షి సిన్హా విషయంలో వచ్చింది. అయితే ఆ పుకార్లకు కారణం తన భర్తే అంటుంది ఈ బ్యూటీ. దానికి సంబంధించిన ఆధారాలను బయటపెడుతూ.. ప్రెగ్నెన్సీ రూమర్స్‌కి చెక్ పెట్టింది. సోనాక్షి ఇటీవల కాస్త బరువు పెరిగింది. దీంతో ఆమె గర్భం దాల్చిందని, అందుకే బొద్దుగా మారిందనే వార్తలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. చాలా మంది నిజమే అని నమ్మారు. తాజాగా దీనిపై సోనాక్షి స్పందించారు. తాను ప్రెగ్నెంట్ కాదని చెబుతూనే.. బరువు పెరగడానికి భర్తే కారణం అని చెప్పకొచ్చింది సోనాక్షి.

భర్త జహీర్ ఇక్బాల్ రోజు తనకు ఏదో ఒకటి తినిపిస్తూనే ఉంటాడట. అలా బయటఫుడ్ తినడం వల్లే బరువు పెరగానని.. దీంతో అందరూ గర్భం దాల్చిందని అనుకున్నారని సోనాక్షి చెప్పకొచ్చింది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత కూడా 'ఆకలేస్తుందా? ఏమైనా తీసుకురావాలా?' అని అడుగుతాడంటూ.. భర్తతో చేసిన వాట్సాప్ చాట్‌ని ఇన్‌స్టా స్టోరీలో షేర్ చేసింది. కాగా, కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న సోనాక్షి, జహీర్ గతేడాది జూన్‌లో వివాహం చేసుకున్నారు. పెళ్లయిన ఐదు నెలల నుంచే ప్రెగ్నెన్సి రూమర్స్ మొదలయ్యాయి. గతంలో కూడా ఇలాంటి రూమర్సే వస్తే.. సోనాక్షి సింపుల్‌గా కొట్టిపారేసింది. ఈ సారి కూడా ఫన్‌వేలో తన ప్రెగ్నెన్సీ రూమర్స్‌కి చెక్ పెట్టింది.

# ఘాటీ వాయిదా



''సినిమా అనేది జీవనది లాంటిది. కొన్నిసార్లు అది వేగంగా ముందుకు వెళుతుంది. కొన్నిసార్లు లోతు పెంచుకోవడానికి ఆగుతుంది. 'ఘాటీ' అనేది కేవలం సినిమా మాత్రమే కాదు... అది పర్వతాల ప్రతిధ్వని, అడవిలోని చల్లటి గాలి. మట్టి నుంచి, రాతి నుంచి చెక్కిన కథ. ప్రతి ఫ్రేమ్‌ని అద్భుతంగా ఆవిష్కరించడం కోసం మేం మరికొంత సమయం వెచ్చించాలనుకున్నాం'' అని 'ఘాటీ' చిత్రబృందం ఓ లేఖ విడుదల చేసింది. అనుష్క లీడ్ రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన చిత్రం 'ఘాటీ'. ఈ నెల 11న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నారు. అయితే వాయిదా వేసినట్లు పేర్కొని, శనివారం ఓ లేఖ విడుదల చేశారు. ''మా సినిమా కోసం ఎదురు చూసే ప్రేక్షకుల నిరీక్షణకు తగ్గట్టు ఓ అద్భుతమైన, ఎప్పటికీ మరచిపోలేని అనుభూతి దక్కుతుంది'' అని యూనిట్ పేర్కొంది. బాధితురాలైన ఓ మహిళ పగ తీర్చుకునే క్రమంలో నేరస్థురాలిగా ఎలా మారింది? ఆ తర్వాత ఎలా లెజెండ్ అయింది? అనేది 'ఘాటీ' చిత్రం ప్రధానాంశం. విజువల్ ఎఫెక్ట్స్‌కిప్రాధాన్యం ఉన్న చిత్రం కావడంతో, ఆ పనులు పూర్తి కాకపోవడం వల్లే రిలీజ్‌ను వాయిదా వేశారట.



## విజయ్‌ను మన తెలుగు హీరోలు ఫాలో అవ్వాలి.. అప్పుడే నిర్మాతలకు..

తమిళ స్టార్ హీరో విజయ్‌ను చూసి మన తెలుగు హీరోలు చాలా నేర్చుకోవాలంటున్నాడు ప్రముఖ నిర్మాత దిల్ రాజు . విజయ్‌ను ఇక్కడి హీరోలు ఫాలో అయిపోతే నిర్మాతలకు చాలా ఖర్చు తగ్గుతుందని చెప్తున్నాడు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ.. విజయ్‌గారు చాలా స్ట్రయిట్ ఫార్వర్డ్. తను పక్కాగా కొన్ని డేట్స్ ఇచ్చి.. అందులోనే సినిమా పూర్తి చేయాలని చెప్తాడు. షూటింగ్ ఎప్పుడు మొదలుపెడుతున్నారు? ఎప్పటివరకు పూర్తి చేస్తారు? అని ముందే అడిగి తెలుసుకుంటాడు.

### ప్రతి హీరో పాటిస్తే..

నెలలో 20 రోజులు షూటింగ్‌కు కేటాయించేవాడు. అలా ఆరు నెలలపాటు డేట్స్ ఇచ్చాడు. వారసుడు సినిమాకుగానూ నాకు 120 రోజులు డేట్స్ ఇచ్చాడు. అందులోనే సినిమా కంప్లీట్ చేశాం. ఈ రూల్ ప్రతి హీరో పాటిస్తే నిర్మాతకు అది సువర్ణావకాశం అవుతుంది. ప్రతి హీరో ఆరునెలల్లో ఎన్ని రోజులు డేట్స్ ఇస్తారో ముందే నిర్ణయించుకుని, అందులోనే మూవీ పూర్తి చేసుకోవాలని చెప్పేస్తే అందరిపై ఒత్తిడి ఉంటుంది. సమయానికి సినిమా అయిపోవాలని నిర్మాత, టెక్నీషియన్స్, దర్శకుడు.. ఇలా అందరూ ఎక్కువ కష్టపడతారు. ప్రీ ప్రొడక్షన్‌కు ఎక్కువ సమయం తీసుకుని ఆరు నెలల్లో సినిమా పూర్తి చేస్తారు. కానీ, ఈ విధానం మన దగ్గర పూర్తిగా కనుమరుగైపోయింది.

### ఖర్చులు తడిసిమోపెడు..

ఆ సిస్టమ్‌ను మళ్లీ తీసుకురావాలని ప్రయత్నిస్తున్నాను. నాతో కలిసి వర్క్ చేయబోయే హీరోలను కూర్చోబెట్టుకుని డేట్స్ కరెక్ట్‌గా ప్లాన్ చేసుకోమంటున్నాను. ప్రతి నెలలో 20 రోజులు నాకు ఇచ్చేయమని చెప్తున్నాను. విజయ్, నితిన్‌లకు అదే చెప్పాను. లేదంటే ఏడాదిలో తీయాల్సిన మూవీ రెండేళ్లలో పూర్తయ్యేసరికి ఖర్చులు రెట్టింపవుతున్నాయి. తీసుకున్న అప్పులకు వడ్డీలు, ప్రొడక్షన్ టీమ్‌కు ఇచ్చే జీతాలు.. ఇలా అన్నీ తడిసిమోపెడవుతున్నాయి. ఈ పద్ధతి మారాలంటే అది హీరోల చేతిలోనే ఉంది. వారు కరెక్ట్ నిర్ణయాలు తీసుకోవాలి అని దిల్ రాజు చెప్పకొచ్చాడు.

# డిప్రెషన్‌లోకి మృణాల్..



***టీవీలో 'కుంకుమ' పెట్టుకొని ప్రారంభించి, నేడు సిల్వర్ స్క్రీన్ పై 'సూపర్'గా మెరుస్తోంది. బ్యూటీకి బ్రెయిన్ మిక్స్ అయితే ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే ఆమెను చూస్తే చాలు, ఎమోషన్ , ఎలిగెన్స్, ఎక్స్‌ప్రెషన్– అన్నింటికీ చిరునామా! మారిన మృణాల్ చెప్పిన ముచ్చట్లు!***

మృణాల్ ఠాకూర్ 'సీతారామం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సరసన నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. నటి కావాలనేది మృణాల్ చిన్నప్పటి కోరిక. కానీ సినిమా రంగంపై అపోహల వల్ల ఆమె తల్లిదండ్రులు మొదట అందుకు అంగీకరించలేదు. ఒకరోజు ఆమె తండ్రికి 'త్రీ ఇడియట్స్' సినిమాను చూపించి, నటి అయితే ఇలాంటి మంచి సినిమాల్లో నటించే అవకాశం ఉంటుందని నచ్చజెప్పింది. అందుకే ప్రతి సినిమా చేసేముందు, తన తల్లిదండ్రులు గర్వపడేలా పాత్ర ఉందా లేదా అని చూసుకుని గ్రీన్ సిగ్నల్ ఇస్తానని మృణాల్ చెబుతుంది. మృణాల్ టీవీ సీరియల్స్‌తో కెరీర్ ప్రారంభించింది. 'కుంకుమ రేఖ' సీరియల్ ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. కాని, ఆడిషన్లకు వెళ్లేటప్పుడు టీవీ నటి అనే ట్యాగ్‌తో చాలామంది చులకనగా చూసేవారు. కొన్నిసార్లు డిప్రెషన్‌ను తట్టుకోలేక, లోకల్ ట్రైన్ నుంచి దూకేయాలనిపించినా, తల్లిదండ్రులు గుర్తొచ్చి ఆగిపోయేదట! హృతిక్ రోషన్, షాహిద్ కపూర్ అంటే మృణాల్‌కు విపరీతమైన అభిమానం. హృతిక్‌తో 'సూపర్ 30', షాహిద్‌తో 'జెర్సీ' సినిమాల్లో నటించే అవకాశం వచ్చినప్పుడు ఆనందంతో పొంగిపోయింది. తెలుగు ఇండస్ట్రీలో ఆమెకు మొదటి పరిచయం దర్శకుడు నాగ్ అశ్విన్ ద్వారా. అప్పుడే తెలుగు పరిశ్రమపై ఒక స్పష్టమైన అభిప్రాయం ఏర్పడిందట! హను రాఘవపూడి 'సీతారామం' కథ చెప్పగానే, ఆ కథలో హీరోయిన్ పాత్రతో ప్రేమలో పడిపోయిందట. ఆ తర్వాత 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీ స్టార్' సినిమాల్లో నటించింది. ఆమె పెర్ఫార్మెన్స్‌కి మంచి పేరు వచ్చింది. తన టీవీ కాలంలో పని చేసిన కొంతమంది నటులు, రచయితలు, మ్యూజిక్ డైరెక్టర్లు, హీరోలతో మృణాల్ పేరు కలిపి డేటింగ్ రూమర్లు వచ్చాయి. వాటిపై ఆమె స్పందిస్తూ, 'నేను ఎవరితో రిలేషన్‌లో ఉన్నాను, ఎవరితో బ్రేకప్– ఇవన్నీ పబ్లిక్‌కి చెప్పాల్సిన అవసరం లేదు. పెళ్లి చేసుకున్నప్పుడు ఎలాగైనా చెబుతాను' అని చెప్పింది. హీరోయిన్‌గా సినిమాల్లో బిజీగా ఉన్నా, వెబ్ సిరీస్‌లకు కూడా ఆసక్తి చూపుతోంది. ఇందుకు ప్రధాన కారణాలుగా తక్కువ పని రోజులు, విభిన్నమైన పాత్రలు, ఎక్కువ రీచ్ వస్తుందని చెప్పింది. మాతృభాష మరాఠీ అయినా, తెలుగు భాష కూడా దగ్గరగా ఉందని, కొద్దిగా బ్రోకెన్ తెలుగులో మాట్లాడగలనని మృణాల్ చెప్పింది. తన కాలేజ్ ఫ్రెండ్స్ క్షేమ, అనుశ్రీ జైన్ ఆమెకు బెస్ట్ ఫ్రెండ్స్. షూటింగ్‌లతో బిజీగా ఉన్నా వాళ్లతో తరచు ట్లాడుతుంటుందట! టీవీ సీరియల్స్‌లో పనిచేస్తున్న రోజుల్లో తరచు అపార్ట్‌మెంట్లు మార్చాల్సి వచ్చేది. ఒక్కో సీరియల్ నెలల తరబడి, ఏళ్ల తరబడి సాగేది. షూటింగ్ లొకేషన్‌కి దగ్గరగా, తక్కువ రెంటులో ఉండే ఫ్లాట్లను ఎంచుకునేది. ఆ సమయంలో వంట పని యాక్టింగ్ కంటే కష్టంగా అనిపించేదట! తెలుగు షూటింగ్‌లకి వచ్చినప్పుడు ఇడ్లీ, వడ ఆమె ఫేవరెట్ బ్రేక్‌ఫాస్ట్. టిఫిన్ కంటే చట్నీలు తినడానికి ఇష్టపడుతుంది మృణాల్. మృణాల్‌కు చెందిన డేట్స్, రెమ్యునరేషన్ వంటి విషయాలు ఆమె సోదరి లోచన్ చూసుకుంటుంది. షూటింగ్‌లలో బిజీగా ఉన్నప్పుడు గంటన్నర, రెండు గంటలకంటే ఎక్కువ నిద్రపోయే అవకాశం ఉండదట. ఎక్కువగా ఫ్లైట్ జర్నీల్లోనే నిద్రపోతుంటుందట మృణాల్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com